విద్యావంతుల భవిష్యత్తుపై ఫోకస్.. కాకతీయ యూనివర్సిటీ నుంచి టీఆర్ఎస్ ఎన్నికల సమరశంఖం




# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

వ్యసనాలకు దూరంగా ఉండాలి.. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 305 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- గురువారం 29 అక్టోబర్ 2026


## కేంద్ర ఉద్యోగులకు 3 శాతం డీఏ పెంపు

**48.54 లక్షల మంది ఉద్యోగులు, 68.71 లక్షల మంది పెన్షనర్లకు లబ్ధి**




**న్యూఢిల్లీ,అక్టోబర్ 28 (పి.సి.డబ్ల్యూ న్యూస్):** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు కేంద్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. కరవు భత్యం (డీఏ), కరవు ఉపశమనం (డీఆర్)ను 3 శాతం పెంచుతూ కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం 60 శాతంగా ఉన్న డీఏ, డీఆర్ తాజా పెంపుతో 63 శాతానికి చేరనున్నాయి. ఈ పెంపు 2026 జూలై 1 నుంచి అమల్లోకి వస్తుంది. దేశవ్యాప్తంగా సుమారు 48.54 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 68.71 లక్షల మంది పెన్షనర్లు ప్రయోజనం పొందనున్నారు. ఈ నిర్ణయంతో ప్రభుత్వ ఖజానాపై ఏడాదికి రూ.10,016.10 కోట్ల అదనపు భారం పడనుంది. పెరిగిన ధరల ప్రభావం నుంచి ఉద్యోగులు, పెన్షనర్లకు కొంత ఉపశమనం కల్పించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రం మిగతా2లో...



## కరువును సమిష్టిగా ఎదుర్కొందాం!

**అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలి**

**ముందస్తు చర్యలు చేపడుతున్నాం.. కేంద్రానికి ఇప్పటికే నివేదిక పంపించాం**

**అవసరమైతే ఢిల్లీకి అఖిలపక్ష బృందం**

**విపక్షాల సూచనలను పరిగణనలోకి తీసుకుంటాం: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

**హైదరాబాద్,అక్టోబర్ 28 (పి.సి.డబ్ల్యూ న్యూస్):** ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో ఏర్పడిన కరువు పరిస్థితులను అందరం కలిసికట్టుగా ఎదుర్కొందామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అఖిలపక్ష నేతలకు విజ్ఞప్తి చేశారు. కరువు నివారణకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ముందస్తు చర్యలు చేపడుతోందని తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆయన అధ్యక్షతన ఎల్‌నినో మిగతా2లో...

## అప్రమత్తంగా ఉండండి..

### – తాగునీటి సమస్య రానివ్వొద్దు!

**ఎల్‌నినో నేపథ్యంలో అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు**

**క్యూర్ ఏరియాలో మురుగునీటి శుద్ధి కేంద్రాలు వందశాతం పనిచేయాలి**

**భవన నిర్మాణాలు, పార్కులు, రోడ్ల శుభ్రతకు శుద్ధి చేసిన నీటినే వినియోగించాలి**

**శుద్ధి చేసిన నీటి సరఫరాపై నిరంతర పర్యవేక్షణ.. నవంబర్ 1 నుంచి ఆదేశాల అమలు**



**హైదరాబాద్,అక్టోబర్ 28 (పి.సి.డబ్ల్యూ న్యూస్):** ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో తాగునీటి సరఫరా విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నగరంలో ఎట్టి పరిస్థితుల్లోనూ తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని జలాశయాల్లో నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. తాగునీటి సరఫరా, మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్మాణం, శుద్ధి చేసిన నీటి వినియోగంపై బుధవారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ క్యూర్ ఏరియాలోని మురుగునీటి శుద్ధి కేంద్రాలు (ఎస్టీపీలు) వందశాతం సామర్థ్యంతో మిగతా2లో...

## ఓటరు జాబితాలో పేరుంటే మళ్లీ ఫారం6 ఎందుకు?

**- ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించిన సుప్రీంకోర్టు**




**న్యూఢిల్లీ,అక్టోబర్ 28 (పి.సి.డబ్ల్యూ న్యూస్):** ఢిల్లీలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై సుప్రీంకోర్టు కీలక ప్రశ్నలు లేవనెత్తింది. గతంలో ఓటర్లుగా నమోదైన వారి పేర్లు తొలగించినప్పుడు, మళ్లీ ఫారం6 సమర్పించాలని ఎందుకు కోరుతున్నారని ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించింది. సాధారణంగా కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునేవారు ఫారం6 ఉపయోగిస్తారని ధర్మాసనం గుర్తుచేసింది.ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని మిగతా2లో...

## ఏపీలో పరిషత్ ఎన్నికలు వాయిదా!

**● నవంబర్ 5న ఎంపీటీసీ, జడ్పీటీసీ పోలింగ్**

**● 7వ తేదీన ఓట్ల లెక్కింపు.. ఎన్నికల సంఘం షెడ్యూల్‌లో మార్పులు**



**అమరావతి,అక్టోబర్ 28 (పి.సి.డబ్ల్యూ న్యూస్):** ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల షెడ్యూల్‌లో రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక మార్పులు చేసింది. నవంబర్ 3న నిర్వహించాల్సిన పోలింగ్‌ను నవంబర్ 5కు వాయిదా వేసింది. అదే రోజు జరగాల్సిన ఓట్ల లెక్కింపును నవంబర్ 7కు మార్చింది. ఈ మేరకు ఎన్నికల సంఘం బుధవారం ప్రకటన విడుదల చేసింది. ఎన్నికల నిర్వహణలో సిబ్బంది కొరత, ఇతర ఏర్పాట్ల పరంగా ఇబ్బందులు తలెత్తకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. **మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్‌లోనూ మార్పులు** ఇప్పటికే పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌లో ఎన్నికల సంఘం మార్పులు చేసింది. మిగతా2లో...

## ఉద్యోగులు ఏఐపై అవగాహన పెంచుకోవాలి

**- ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు సాంకేతికతను వినియోగించాలి: భట్టి విక్రమార్క**




## వణికిస్తున్న అర్నాబ్ తుపాను!

**పంటలకు తీవ్ర నష్టం.. అప్రమత్తమైన అధికార యంత్రాంగం**






## మోడీ ఫాసిస్టు పాలనకు నూకలు చెల్లే రోజులు దగ్గర్లోనే!

**● ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఢిల్లీ వెళ్లి తీరుతాం: మహేశ్‌కుమార్ గౌడ్ ● ప్రత్యేక రైళ్లు కేటాయించకపోవడంపై కాంగ్రెస్ నేతల ఆగ్రహం**

**హైదరాబాద్,అక్టోబర్ 28 (పి.సి.డబ్ల్యూ న్యూస్):** మోడీ ఫాసిస్టు పాలనకు నూకలు చెల్లే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. నవంబర్ 1న ఢిల్లీలో నిర్వహించనున్న 'ఓట్ బచావోదేశ్ బచావో' నిరసన కార్యక్రమానికి వెళ్లేందుకు మిగతా2లో...

## రాష్ట్రంలో ఎమర్జెన్సీ తరహా పాలన!

**సబితా ఇంద్రారెడ్డి హౌస్ అరెస్టుపై హరీశ్‌రావు ఖండన**

**ప్రజల గొంతు నొక్కడం సరికాదు: నిరంజన్‌రెడ్డి**



**హైదరాబాద్,అక్టోబర్ 28 (పి.సి.డబ్ల్యూ న్యూస్):** మూసీ ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లకుండా మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని గృహ నిర్బంధం చేయడంతో పాటు, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, బీఆర్ఎస్ నేత కార్తీక్‌రెడ్డిని అరెస్టు చేయడాన్ని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీ మంత్రి టి. హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. ప్రతిపక్ష నేతలను నిర్బంధిస్తూ రాష్ట్రంలో ఎమర్జెన్సీ తరహా పాలన సాగించడం సిగ్గుచేటని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో విమర్శించారు.

మిగతా2లో...

# అప్రమత్తంగా ఉండండి..

**(మొదటి పేజీ తరువాయి)**

పనిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. శుద్ధి చేసిన నీటిని వృథా చేయకుండా వివిధ అవసరాలకు వినియోగించేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు. భవిష్యత్తులో నీటి అవసరాలు పెరిగే అవకాశాలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే తగిన ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. **భవన నిర్మాణాల్లో శుద్ధి చేసిన నీటినే వాడాలి**సచివాలయం, ముఖ్యమంత్రి కార్యాలయం, ఔటర్ రింగ్ రోడ్డు, మెట్రో రైలు పరిధి, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో పచ్చదనం నిర్వహణకు శుద్ధి చేసిన నీటిని వినియోగించాలని సీఎం సూచించారు. పబ్లిక్ పార్కుల నిర్వహణ, రోడ్ల శుభ్రతకు కూడా శుద్ధి చేసిన నీటినే ఉపయోగించాలని ఆదేశించారు. భవన నిర్మాణాల్లో శుద్ధి చేసిన నీటిని వినియోగించాలనే నిబంధనను కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు.ప్రైవేటు మురుగునీటి శుద్ధి కేంద్రాల ఏర్పాటును ప్రోత్సహించాలని, డేటా కేంద్రాలకు కూడా శుద్ధి చేసిన నీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్టీపీల నిర్వహణకు సౌర విద్యుత్తును వినియోగించే అవకాశాలను పరిశీలించాలని సంబంధిత అధికారులకు తెలిపారు. శుద్ధి కేంద్రాల్లో ఆధునిక సాంకేతిక ప్రమాణాలను పాటించాలని, నీటి నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని స్పష్టం చేశారు. **శుద్ధి కేంద్రాలపై నిరంతర పర్యవేక్షణ**ప్రతి మురుగునీటి శుద్ధి కేంద్రం వద్ద ప్రత్యేక అధికారిని నియమించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అన్ని కేంద్రాలను కమాండ్ కంట్రోల్ కేంద్రంతో అనుసంధానించి, వాటి పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. శుద్ధి చేసిన నీటిని సరఫరా చేసే ట్యాంకర్లను గుర్తించి పర్యవేక్షించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ నీటి వినియోగంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని, శుద్ధి చేసిన నీటి సరఫరా కోసం ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎస్టీపీల నిర్వహణ, శుద్ధి చేసిన నీటి వినియోగానికి సంబంధించి నవంబర్ 1 నుంచి ఆదేశాలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. ప్రస్తుతం 26 మురుగునీటి శుద్ధి కేంద్రాల నుంచి శుద్ధి చేసిన నీటిని పచ్చరంగు ట్యాంకర్ల ద్వారా పంపిణీ చేస్తున్నట్లు జలమండలి అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. వినియోగదారుల నుంచి కేవలం రవాణా ఛార్జీలు మాత్రమే వసూలు చేస్తున్నామని, నీటిని ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. **సమీక్షలో ఉన్నతాధికారులు** ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి మాణిక్‌రాజ్, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన, మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి, జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి, టీజీఎస్‌పీడీసీఎల్ ఎండీ జితేష్ వి. పాటిల్, కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి రవి, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ముకుందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కరువును సమిష్టిగా ఎదుర్కొందాం!

**(మొదటి పేజీ తరువాయి)**

ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో రాజకీయ విమర్శలకు తావివ్వకుండా ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా అన్ని పార్టీలు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. **కేంద్రానికి నివేదిక.. అవసరమైతే ఢిల్లీకి అఖిలపక్షం**రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులపై కేంద్ర ప్రభుత్వానికి ఇప్పటికే నివేదిక పంపించామని భట్టి విక్రమార్క వెల్లడించారు. అవసరమైతే అఖిలపక్ష ప్రతినిధి బృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి తెలంగాణకు రావాల్సిన సహాయంపై కేంద్రాన్ని కోరుతామని తెలిపారు. సమావేశంలో వివిధ పార్టీల నేతలు చేసిన సూచనలను నమోదు చేసుకున్నామని, సాధ్యమైన మేరకు వాటిని ప్రభుత్వ కార్యాచరణలో భాగంగా అమలు చేసేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు.ఎల్‌నినో ప్రభావంపై గతంలో శాసనసభలో చర్చించామని, శాస్త్రవేత్తలు, నిపుణులతో సంప్రదింపులు జరిపామని వివరించారు. కరువు పరిస్థితులపై అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసిందని, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఎదురయ్యే పరిస్థితులను ముందుగానే అంచనా వేసి అవసరమైన సన్నద్ధతతో ఉన్నామని తెలిపారు.**తాగునీరు, పశువుల మేతకు ప్రాధాన్యం** దేశవ్యాప్తంగా వర్షపాతం లోటు ఉండటంతో పాటు ఎగువ రాష్ట్రాల్లోనూ వర్షాలు తక్కువగా కురవడం వల్ల ప్రాజెక్టుల్లోకి నీటి ప్రవాహాలు తగ్గాయని భట్టి విక్రమార్క ఆందోళన వ్యక్తం చేశారు. రిజర్వాయర్లలో అందుబాటులో ఉన్న నీటి నిల్వలను దృష్టిలో ఉంచుకుని వనరులను సమర్థంగా వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. వర్షాభావ ప్రభావాన్ని తగ్గించేందుకు శాఖలవారీగా సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

# రాష్ట్రంలో ఎమర్జెన్సీ తరహా పాలన!

**(మొదటి పేజీ తరువాయి)**

**రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు** కాంగ్రెస్ ప్రభుత్వం కరువు బారిన పడిన రైతులను, కష్టాల్లో ఉన్న ప్రజలను ఆదుకోవడం మానేసి, మూసీ ప్రక్షాళన పేరుతో రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేస్తామని చెప్పడం ఏమిటని హరీశ్‌రావు ప్రశ్నించారు. కరువు బాధిత రైతులను ఆదుకోవడంపై చూపాల్సిన శ్రద్ధను ప్రభుత్వం చూపడం లేదని విమర్శించారు. **రైతులకు ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇవ్వాలి** మూసీ ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లకుండా తనను, తన కుమారుడిని గృహ నిర్బంధం చేయడంపై మాజీ మంత్రి పి. సబితా ఇంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులను ఆదుకోకుండా మూసీ ప్రాజెక్టుకు రూ.1.40 లక్షల కోట్లు ఖర్చు చేస్తామనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కరువు బారిన పడిన రైతులకు ఎకరాకు రూ.50 వేల పరిహారం చెల్లించాలని, కాళేశ్వరం నీటిని వినియోగించి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్బంధాలకు పాల్పడినా ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు .**ప్రజాభిప్రాయ సేకరణ అందరితో జరపాలి** ప్రజాభిప్రాయ సేకరణ పేరుతో ప్రజల గొంతు నొక్కడం సరికాదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. సబితా ఇంద్రారెడ్డి, ఇతర బీఆర్ఎస్ నేతల అరెస్టులను అక్రమంగా అభివర్ణించారు. మూసీ ప్రజాభిప్రాయ సేకరణ విషయంలో ప్రభుత్వం విభజించి పాలించే విధానాన్ని అనుసరిస్తోందని విమర్శించారు. ప్రజలందరితో ఒకేసారి అభిప్రాయ సేకరణ జరపాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ తప్పులకు ప్రజాక్షేత్రంలో శిక్ష తప్పదని హెచ్చరించారు.

# 12 మంది ఐఏఎస్ అధికారుల బదిలీలు

- **జయేష్ రంజన్‌కు పర్యావరణ శాఖ**
- **వికాస్ రాజ్‌కు ఇంధన శాఖ బాధ్యతలు**



**హైదరాబాద్, అక్టోబర్ 28 (పి.సి.డబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో పరిపాలనా సౌలభ్యం, శాఖల నిర్వహణ అవసరాల దృష్ట్యా ప్రభుత్వం 12 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేసింది. పలువురు అధికారులకు అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీలు, నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు.సీనియర్ ఐఏఎస్ అధికారి జయేష్ రంజన్‌ను పర్యావరణం, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించారు. పర్యావరణ పరిరక్షణ శిక్షణ, పరిశోధన సంస్థ (ఈపీటీఆర్ఐ) డైరెక్టర్ జనరల్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. రవాణా, రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న వికాస్ రాజ్‌ను ఇంధన శాఖకు బదిలీ చేశారు. ఇంధన శాఖలో పనిచేస్తున్న నవీన్ మిట్టల్‌ను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించారు.ఏ. వాణిప్రసాద్‌కు తెలంగాణ పురావస్తుశాఖ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. శైలజా రామయ్యర్‌ను రెవెన్యూ శాఖలో దేవాదాయ విభాగం ప్రభుత్వ ముఖ్య కార్యదర్శిగా నియమించారు. కే. ఇలంబర్తిని రవాణా, రహదారులు, భవనాల శాఖ కార్యదర్శిగా నియమించి, రవాణా శాఖ కమిషనర్ బాధ్యతలు కూడా అప్పగించారు. ఆయన పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖల కార్యదర్శిగా అదనపు బాధ్యతల్లో కొనసాగుతారు.హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌కు మెట్రోపాలిటన్ ఏరియా, పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శిగా, జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మల్కాజిగిరి పురపాలక సంస్థల ప్రత్యేక అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. రాహుల్ బొజ్జాకు గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బాధ్యతలు అదనంగా ఇచ్చారు. ఆయన వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ బాధ్యతల్లోనూ కొనసాగుతారు.మహిళా, శిశు సంక్షేమం, దివ్యాంగుల సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శిగా శృతి ఓఝాను నియమించారు. ఎస్. సంగీత సత్యనారాయణను ఆ శాఖ డైరెక్టర్‌గా నియమించారు. మహమ్మద్ ముషారఫ్ అలీ ఫారూఖీని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా నియమించి, తెలంగాణ రైతు విద్యుత్తు పంపిణీ సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్‌కు తెలంగాణ పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ ఉపాధ్యక్షుడు, నిర్వహణ సంచాలకుడిగా అదనపు బాధ్యతలు ఇచ్చారు. పదవీ విరమణ నేపథ్యంలో ఎం. దానకిశోర్‌ను గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా తిరిగి నియమించారు.



# నేడు ఢిల్లీకి సీఎం రేవంత్‌రెడ్డి

**- ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ప్రచార కార్యక్రమంలో పాల్గొననున్న ముఖ్యమంత్రి**

**హైదరాబాద్, అక్టోబర్ 28 (పి.సి.డబ్ల్యూ న్యూస్):** ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి గురువారం ఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిం చనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న ఈ సదస్సు ద్వారా తెలంగాణలో పెట్టుబడుల అవకాశాలను పారిశ్రామికవేత్తలు, అంతర్జాతీయ ప్రతినిధులకు వివరించనున్నారు.ఇదిలా ఉండగా, నవంబర్ 4న హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించనున్న సదర్ ఉత్సవానికి హాజరుకావాలని శ్రీ కృష్ణ సదర్ సమ్మేళనం ఉత్సవ కమిటీ ప్రతినిధులు సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించారు. ఈ మేరకు గురువారం ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో కమిటీ ఛైర్మన్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, యాదాద్రి బోర్డు సభ్యురాలు ఈశ్వరమ్మ యాదవ్, మేడ్చల్ డీసీసీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ఉద్యోగులకు 3 శాతం డీఏ పెంపు

**(మొదటి పేజీ తరువాయి)**

వెల్లడించింది. **గ్రామీణాభివృద్ధికి రూ.7,395 కోట్ల పథకం** ప్రధానమంత్రి వికసిత్ గ్రామ స్వరాజ్ యోజనకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఐదేళ్లలో రూ.7,395.55 కోట్ల వ్యయంతో 202627 నుంచి 203031 వరకు ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. దేశవ్యాప్తంగా 2.78 లక్షలకు పైగా గ్రామీణ స్థానిక సంస్థలకు ప్రయోజనం చేకూరనుంది.**కంటైనర్, క్రీడా వస్తువుల తయారీకి ప్రోత్సాహం** దేశీయ కంటైనర్ తయారీ పరిశ్రమను బలోపేతం చేసేందుకు రూ.10 వేల కోట్ల ప్రోత్సాహక పథకానికి ఆమోదం తెలిపారు. అలాగే క్రీడా వస్తువుల తయారీ రంగ అభివృద్ధికి రూ.1,856.67 కోట్లతో ఖేలో ఇండియా పథకాన్ని అమలు చేయనున్నారు. ఈ నిర్ణయాలతో దేశీయ తయారీ రంగం, గ్రామీణ స్థానిక సంస్థల అభివృద్ధికి ఊతం లభించనుంది.

# ఓటరు జాబితాలో పేరుంటే మళ్లీ ఫారం6 ఎందుకు?

**(మొదటి పేజీ తరువాయి)**

ధర్మాసనం విచారణ సందర్భంగా, చిరునామా మార్పులు, ఓటరు వివరాల సవరణలకు సాధారణంగా ఫారం8 ఉపయోగిస్తారని పేర్కొంది. పిటిషనర్ల తరఫున న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదిస్తూ, ఢిల్లీలో ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి సుమారు 43 లక్షల మంది పేర్లు తొలగించారని తెలిపారు. గతంలో ఓటర్లుగా నమోదైనవారిని తిరిగి చేర్చేందుకు ఫారం6 కోరడం వల్ల సమస్యలు తలెత్తుతున్నాయని అభ్యంతరం వ్యక్తం చేశారు.ఎన్యుమరేషన్ ఫారాలను గడువు ముగిసిన తర్వాత కూడా స్వీకరించే అంశాన్ని పరిశీలించాలని సుప్రీంకోర్టు సూచించింది. తుది ఓటర్ల జాబితా సిద్ధమయ్యే వరకు అర్హులైనవారు తమ వివరాలు సమర్పించేందుకు అవకాశం కల్పించాలని పేర్కొంది. ఈ ప్రక్రియపై ప్రజలకు అర్థమయ్యే భాషలో విస్తృత అవగాహన కల్పించాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

# ఏపీలో పరిషత్ ఎన్నికలు వాయిదా!

**(మొదటి పేజీ తరువాయి)**

అక్టోబర్ 28న జరగాల్సిన పోలింగ్‌ను నవంబర్ 1కు, అక్టోబర్ 30న నిర్వహించాల్సిన ఓట్ల లెక్కింపును నవంబర్ 3కు మార్చింది. దీంతో నవంబర్ 3న మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ఒకే రోజు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన పోలీసు సిబ్బంది, ఇతర సిబ్బంది అందుబాటును దృష్టిలో ఉంచుకుని పరిషత్ ఎన్నికల తేదీలను సవరించినట్లు సమాచారం.**తాజా షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు** స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను కొనసాగించాలని సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో ఎన్నికల సంఘం ఈ మార్పులు చేసింది. తాజా షెడ్యూల్ ప్రకారం నవంబర్ 5న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ నిర్వహించనున్నారు. నవంబర్ 6న అవసరమైన చోట రీపోలింగ్ చేపట్టనున్నారు. నవంబర్ 7న ఓట్ల లెక్కింపు నిర్వహించి ఫలితాలను ప్రకటించనున్నారు.ఎన్నికల తేదీల మార్పుతో అధికారులు ఏర్పాట్లను సమన్వయం చేసుకునేందుకు అవకాశం కలగనుంది. అభ్యర్థులు, రాజకీయ పార్టీలు సవరించిన షెడ్యూల్‌కు అనుగుణంగా తమ ఎన్నికల కార్యక్రమాలను రూపొందించుకోవాల్సి ఉంటుంది.

# మోడీ ఫాసిస్టు పాలనకు నూకలు చెల్లే రోజులు దగ్గర్లోనే!

**(మొదటి పేజీ తరువాయి)**

ప్రత్యేక రైళ్లు కేటాయించకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఢిల్లీకి వెళ్లి నిరసనను విజయవంతం చేస్తామని స్పష్టం చేశారు.**దక్షిణ మధ్య రైల్వే కార్యాలయం ఎదుట ధర్నా** ఢిల్లీలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి వెళ్లేందుకు ప్రత్యేక రైళ్లు కేటాయించాలని కాంగ్రెస్ నేతలు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌ను కోరారు. ఇందుకు నిరాకరించడంతో బుధవారం సికింద్రాబాద్‌లోని జీఎం కార్యాలయం ఎదుట కాంగ్రెస్ నాయకులు మెరుపు ధర్నా చేపట్టారు. మహేశ్‌కుమార్ గౌడ్‌తో పాటు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఆందోళనలో పాల్గొన్నారు. అనంతరం పలువురు నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.**బస్సుల్లో ఢిల్లీకి తరలింపు** ప్రత్యేక రైళ్ల కోసం ఆరు రోజుల ముందే దరఖాస్తు చేసినప్పటికీ చివరి నిమిషంలో తిరస్కరించారని మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. నిరసన కార్యక్రమానికి వెళ్లకుండా అడ్డుకునేందుకే ఇలా చేస్తున్నారని ఆరోపించారు. అయినప్పటికీ తెలంగాణ నుంచి భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు ఢిల్లీకి తరలివెళ్తారని తెలిపారు. ఇందుకోసం అవసరమైన బస్సులు, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో జరిగే నిరసనను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

# వణికిస్తున్న అర్నాబ్ తుపాను!

- **పంటలకు తీవ్ర నష్టం.. అప్రమత్తమైన అధికార యంత్రాంగం**

**హైదరాబాద్, అక్టోబర్ 28 (పి.సి.డబ్ల్యూ న్యూస్):**అర్నాబ్ తుపాను ప్రభావంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వరి పంట నేలకొరగగా, పత్తి, మొక్కజొన్న, మిర్చి పంటలకు నష్టం వాటిల్లింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సరాసరి 10.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులతో పరిస్థితిని సమీక్షించి ప్రజల భద్రతకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విద్యాసంస్థలకు సెలవు ప్రకటించగా, ఖమ్మం జిల్లాలో పరిస్థితులను బట్టి సెలవులు ప్రకటించాలని అధికారులు ఆదేశించారు. గోదావరి పరివాహక, లోతట్టు ప్రాంతాల్లో అప్రమత్తత పెంచి సహాయక బృందాలను సిద్ధంగా ఉంచారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, విద్యుత్ తీగలు, పాత గోడలు, పెద్ద చెట్లకు దూరంగా ఉండాలని అధికారులు సూచించారు. పంట నష్టానికి పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

# ఉద్యోగులు ఏఐపై అవగాహన పెంచుకోవాలి

**హైదరాబాద్, అక్టోబర్ 28 (పి.సి.డబ్ల్యూ న్యూస్):**మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా ప్రభుత్వ ఉద్యోగులందరూ కృత్రిమ మేధస్సు (ఏఐ)పై అవగాహన పెంచుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు. ఏఐ సాధనాలను సమర్థవంతంగా వినియోగించుకొని ప్రభుత్వ పనులను వేగవంతం చేయడంతోపాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు.హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో బుధవారం ప్రణాళికా శాఖ, టీజీ మ్యాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఏఐ సాక్షమ్' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉత్తర్వుల గుర్తింపు, నివేదికల తయారీ, సమాచార విశ్లేషణ, ప్రజల సమస్యల పరిష్కారం వంటి పనుల్లో కృత్రిమ మేధస్సు ఉపయోగపడుతుందని తెలిపారు. రైతుల దరఖాస్తులు త్వరగా పరిష్కారం కావడం, పింఛనుదారులకు అవసరమైన సమాచారం సులభంగా అందడం వంటి ప్రయోజనాలు ప్రజలకు కలగాలని పేర్కొన్నారు.

విద్యుత్ డిమాండ్‌ను అంచనా వేయడం, పరికరాల్లో లోపాలను ముందుగానే గుర్తించడం, అభివృద్ధి పనుల్లో జాప్యానికి కారణాలను విశ్లేషించడం వంటి అంశాల్లోనూ ఏఐని వినియోగించుకోవచ్చని చెప్పారు. అయితే ఏఐ సాధనాలను ఉపయోగించేటప్పుడు సమాచార భద్రత, కచ్చితత్వం, బాధ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. ఏఐ ద్వారా లభించిన సమాచారాన్ని అధికారికంగా వినియోగించే ముందు ధ్రువీకరించుకోవాలని సూచించారు. ప్రభుత్వ శాఖల్లో ఏఐ వినియోగానికి అనువైన పనులను గుర్తించి, తొలుత ప్రయోగాత్మకంగా అమలు చేసి ఫలితాల ఆధారంగా విస్తరించాలని భట్టి విక్రమార్క కోరారు.

# వ్యసనాలకు దూరంగా ఉండాలి..
# ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

**- సామాజిక ఒత్తిళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలి: కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**






**ములుగు జిల్లా, అక్టోబర్ 28 (పి.సి.డబ్ల్యూ న్యూస్):** విద్యార్థులు సామాజిక ఒత్తిళ్లను ధైర్యంగా ఎదుర్కొంటూ చెడు వ్యసనాలకు 'నో' చెప్పాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు సూచించారు. చదువుతో పాటు క్రీడలు, పౌష్టికాహారం, నిత్య వ్యాయామానికి ప్రాధాన్యమిస్తూ ఆరోగ్యకరమైన జీవితాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'నషా ముక్త్ భారత్' అవగాహన కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్ హాజరయ్యారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా వర్చువల్ విధానంలో చేసిన ప్రసంగాన్ని విద్యార్థులతో కలిసి వీక్షించారు. అనంతరం నషా ముక్త్ భారత్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ మత్తుపదార్థాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, మత్తురహిత సమాజ నిర్మాణానికి ప్రజలంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ స్నేహితుల ఒత్తిడితో మత్తుపదార్థాలు, ఇతర చెడు అలవాట్లకు లోనుకావద్దని విద్యార్థులకు సూచించారు. ఎవరైనా బలవంతం చేసినా తమ నిర్ణయంపై దృఢంగా నిలబడి వ్యసనాలను తిరస్కరించాలని తెలిపారు. విద్యార్థులు క్రికెట్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ వంటి క్రీడల్లో పాల్గొంటూ శారీరక శ్రమకు సమయం కేటాయించాలని, పౌష్టికాహారం తీసుకుంటూ తగినంత నిద్రపోవాలని సూచించారు. మంచి అలవాట్లను పాఠశాల దశ నుంచే అలవర్చుకుని జీవితాంతం కొనసాగించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ అల్లం అప్పయ్య, వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీనివాస్, కార్యదర్శి రాజి రెడ్డి, కోశాధికారి శిరుప సతీష్ కుమార్, రెడ్‌క్రాస్ సభ్యులు, విద్యార్థినీ విద్యార్థులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సమష్టి కృషితో ఎమ్మెల్సీ విజయం సాధించాలి

**పార్టీ శ్రేణులలంతా ఎన్నికల కార్యాచరణలో భాగస్వాములు కావాలి**

**టిఆర్ఎస్ గ్రేటర్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు లయన్ డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు**

**హనుమకొండ,అక్టోబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఎన్నికల్లో విజయాన్ని సాధించాలంటే నాయకత్వం నుంచి కార్యకర్తల వరకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని టీఆర్ఎస్ గ్రేటర్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు లయన్ డా. నడిపెల్లి వెంకటేశ్వర్ రావు సూచించారు. వరంగల్‌ఖమ్మం నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి నలమాస శ్రీకాంత్ గౌడ్ గెలుపు కోసం క్షేత్రస్థాయిలో పటిష్టమైన కార్యాచరణ చేపట్టాలని పిలుపునిచ్చారు. బుధవారం హనుమకొండలోని టీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి విస్తృత సమావేశానికి ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు ఇస్మాయిల్, పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి నలమాస శ్రీకాంత్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సమావేశంలో ఎన్నికల వ్యూహాలు, పార్టీ కార్యక్రమాల విస్తరణ, పట్టభద్రులతో సంప్రదింపులు, నాయకులు, కార్యకర్తల బాధ్యతలపై చర్చించారు. ఈ సందర్భంగా టిఆర్ఎస్ నేత డాక్టర్ వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ.. పార్టీ అభ్యర్థి విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని, పట్టభద్రులను కలిసి పార్టీ లక్ష్యాలను వివరించాలని సూచించారు. ఎన్నికల ప్రచారాన్ని సమన్వయంతో నిర్వహిస్తూ పార్టీకి ప్రజల్లో మరింత ఆదరణ పెరిగేలా పనిచేయాలని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు ఇస్మాయిల్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో ప్రతి దశను ప్రణాళికాబద్ధంగా నిర్వహించడం ముఖ్యమని తెలిపారు. పట్టభద్రులను చేరుకోవడానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని, అర్హులైన పట్టభద్రులకు ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలని సూచించారు. పార్టీ నిర్దేశించిన కార్యాచరణను సమర్థంగా అమలు చేయాలని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి నలమాస శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ పార్టీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు కృషి చేస్తానని తెలిపారు. నాయకులు, కార్యకర్తల సహకారం, పట్టభద్రుల మద్దతు తనకు ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. అందరి సమష్టి కృషితో ఎన్నికల్లో విజయం సాధించి, పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తాననే విశ్వాసం వ్యక్తం చేశారు. పట్టభద్రులు తనకు మద్దతు తెలిపి విజయానికి సహకరించాలని కోరారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేస్తూ ప్రజా సమస్యలపై నిరంతరం స్పందించాలని సమావేశంలో చర్చించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించేందుకు నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని, పట్టభద్రులతో నిరంతర సంబంధాలు కొనసాగించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో టిఆర్ఎస్ రాష్ట్ర, జిల్లా నేతలు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.



## విద్యావంతుల భవిష్యత్తుపై ఫోకస్.. కాకతీయ యూనివర్సిటీ నుంచి

# టీఆర్ఎస్ ఎన్నికల సమరశంఖం

**ఉద్యోగాలు, నిరుద్యోగ సమస్యలు, పట్టభద్రుల హక్కులే ప్రచారాస్త్రాలు**

**నలమాస శ్రీకాంత్ గౌడ్‌కు మద్దతుగా రంగంలోకి దిగిన తెలంగాణ రక్షణ సేన నేతలు**





**హనుమకొండ,అక్టోబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పట్టభద్రుల ఓటు కేవలం ఎన్నికల విజయానికి పరిమితం కాకుండా, విద్యావంతుల భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసే శక్తిగా మారాలన్న లక్ష్యంతో తెలంగాణ రక్షణ సేన వరంగల్‌ఖమ్మంనల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించింది. నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సవాళ్లు, ఉద్యోగ నియామకాలపై ఆశలు, విద్యారంగ సమస్యలు, పట్టభద్రుల హక్కుల పరిరక్షణను ప్రధాన అంశాలుగా ముందుకు తెస్తూ పార్టీ అభ్యర్థి డా. నలమాస శ్రీకాంత్ గౌడ్ బుధవారం కాకతీయ యూనివర్సిటీలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. విద్యావంతులు అధికంగా ఉండే యూనివర్సిటీ ప్రాంగణంలోనే ప్రచారానికి శ్రీకారం చుట్టడం ద్వారా పట్టభద్రులతో ప్రత్యక్షంగా మమేకమై, వారి అభిప్రాయాలను తెలుసుకోవడంపై పార్టీ నాయకత్వం దృష్టి పెట్టింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు సయ్యద్ ఇస్మాయిల్, అభ్యర్థి నలమాస శ్రీకాంత్ గౌడ్‌లకు తెలంగాణ రక్షణ సేన గ్రేటర్ వరంగల్ అధ్యక్షుడు లయన్ డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు స్వాగతం పలికారు. అనంతరం ఆయన పార్టీ నాయకులతో కలిసి పట్టభద్రులను కలుసుకుంటూ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.

**ఉద్యోగమే కాదు.. హక్కుల సాధన కూడా కీలకమే**

ఉన్నత విద్యను పూర్తి చేసినప్పటికీ ఆశించిన ఉద్యోగ అవకాశాలు అందకపోవడం, అర్హతకు తగిన ఉపాధి కోసం యువత ఎదురుచూడాల్సి రావడం, విద్యారంగ సమస్యలకు పరిష్కారం లభించాలనే ఆకాంక్షలు పట్టభద్రుల్లో ప్రధానంగా కనిపిస్తున్నాయి. ఈ అంశాలపై శాసనమండలిలో సమర్థంగా మాట్లాడగల ప్రాతినిధ్యం ఉండాల్సిన అవసరాన్ని తెలంగాణ రక్షణ సేన నాయకులు ప్రచారంలో ప్రస్తావించారు. పట్టభద్రుల సమస్యలను ఎన్నికల సమయంలో మాత్రమే ప్రస్తావించడం కాకుండా, ఎన్నికల అనంతరం కూడా వాటిపై నిరంతరం పోరాడే నాయకత్వం అవసరమనే సందేశాన్ని ఓటర్లకు చేరవేసే ప్రయత్నం చేశారు. నిరుద్యోగ యువతకు సంబంధించిన అంశాలు, ఉద్యోగ నియామకాలు, విద్యావంతులకు అందాల్సిన అవకాశాలు, విద్యారంగ అభివృద్ధి వంటి అంశాలపై పట్టభద్రుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. వారి సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ, పరిష్కార దిశగా కృషి చేసే నాయకుడిని ఎన్నుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**యూనివర్సిటీ కేంద్రంగా ఓటర్లతో మమేకం**

కాకతీయ యూనివర్సిటీ ప్రచార కార్యక్రమం ద్వారా యువ పట్టభద్రులు, ఉద్యోగార్థులు, విద్యావంతులతో నేరుగా సంబంధాలు పెంచుకోవడమే కాకుండా, ఎమ్మెల్సీ ఎన్నికలపై అవగాహన కల్పించేందుకు తెలంగాణ రక్షణ సేన ప్రయత్నించింది. పట్టభద్రుల ఓటు విలువను గుర్తించి, తమ సమస్యలకు ప్రాతినిధ్యం వహించే అభ్యర్థి ఎంపికలో చైతన్యంతో వ్యవహరించాలని పార్టీ నాయకులు కోరారు. పట్టభద్రుల ఎన్నికలు రాజకీయ పార్టీల మధ్య పోటీ మాత్రమే కాకుండా, విద్యావంతుల ఆకాంక్షలు, యువత ఉపాధి భవిష్యత్తు, ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధించిన అంశాలకు ప్రాధాన్యతనిచ్చే వేదికగా నిలవాలనే అభిప్రాయాన్ని ప్రచారం ద్వారా ముందుకు తెచ్చారు. ఈ క్రమంలో పార్టీ అభ్యర్థి నలమాస శ్రీకాంత్ గౌడ్‌కు మద్దతు కూడగట్టేందుకు నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రచారాన్ని విస్తరించేందుకు సిద్ధమయ్యారు. కాకతీయ యూనివర్సిటీలో ప్రారంభమైన ఈ కార్యక్రమం పట్టభద్రులతో ప్రత్యక్ష సంబంధాలను బలోపేతం చేసుకునే దిశగా తెలంగాణ రక్షణ సేన చేపట్టిన ప్రచార కార్యాచరణలో భాగంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు, శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 'అర్నాబ్' తుఫాన్ ప్రభావం నేపథ్యంలో డంపింగ్ యార్డు బాధిత ప్రజల ఆరోగ్య రక్షణకు తక్షణ చర్యలు చేపట్టాలి!

**● సీపీఐ(ఎంఎల్) చంద్రపుల్లారెడ్డి పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి షేక్ షావలి**



**జవహర్ నగర్ అక్టోబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్):** 'అర్నాబ్' తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలు, వాతావరణ మార్పుల నేపథ్యంలో జవహర్‌నగర్ రాంకీ డంపింగ్ యార్డు పరిసర ప్రాంతాల ప్రజల ఆరోగ్య రక్షణకు తెలంగాణ ప్రభుత్వం, రాంకీ యాజమాన్యం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని సీపీఐ(ఎంఎల్) చంద్రపుల్లారెడ్డి పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి షేక్ షావలి డిమాండ్ చేశారు. ఇప్పటికే అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు కలుషిత నీరు, దుర్వాసన, దోమల బెడద మరింత ప్రమాదకరంగా మారకుండా తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. సురక్షిత తాగునీరు, వైద్య శిబిరాలు, పారిశుద్ధ్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలని, డంపింగ్ యార్డు నుంచి వెలువడే లీచేట్ కలుషిత నీరు జనావాసాల్లోకి చేరకుండా అడ్డుకోవాలని సూచించారు. యాప్రాల్, జవహర్‌నగర్, నాగారం, దమ్మాయిగూడ ప్రాంతాల్లో చెత్త రవాణా వాహనాల వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. తుఫాన్ విపత్తుతోపాటు డంపింగ్ యార్డు కాలుష్యం ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారకుండా ప్రభుత్వం, రాంకీ యాజమాన్యం నిర్లక్ష్యాన్ని వీడి తక్షణమే సమగ్ర ఆరోగ్య రక్షణ చర్యలు చేపట్టాలి. ప్రజల ప్రాణాలకు నష్టం జరిగితే బాధ్యత వహించాల్సి ఉంటుందని షేక్ షావలి హెచ్చరించారు.

# పోలీసులపై దాడి కేసులో నిందితుడికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.20 వేల జరిమానా

**● సత్తుపల్లి కోర్టు కీలక తీర్పు.. ● ప్రాసిక్యూషన్‌కు సహకరించిన అధికారులను అభినందించిన పోలీస్ కమిషనర్**

**సత్తుపల్లి, అక్టోబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పోలీసులపై దాడి, విధులకు ఆటంకం కలిగించడం, ఇతర నేరాలకు సంబంధించిన కేసులో నిందితుడికి సత్తుపల్లిలోని గౌరవనీయ ఆరవ అదనపు జిల్లా సెషన్స్ న్యాయస్థానం పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు మొత్తం రూ.20 వేలు జరిమానా విధిస్తూ గౌరవనీయ న్యాయమూర్తి ఎం. శ్రీనివాస్ ఈ తీర్పు వెలువరించారు. ఈ కేసులో ఏలూరు జిల్లా, చాట్రాయి మండలం, చిత్తాపూర్ గ్రామానికి చెందిన తిరువీధుల సురేంద్ర అలియాస్ సూర్య నిందితుడిగా ఉన్నాడు. 2025 మార్చి 10 న చోరీ కేసు లోని నిందితుడు కోసం సత్తుపల్లి పట్టణ పరిసరాల గాలిస్తున్న పోలీసులపై ఉద్దేశపూర్వకంగా హత్య చేసేందుకు కత్తితో దాడి చేసి గాయపరిచిన నిందితుడు సురేంద్ర అలియాస్ సూర్యపై సత్తుపల్లి పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 126/2025గా భారతీయ న్యాయ సంహిత సెక్షన్లు 109, 132, 121(1) కింద నమోదైనది. న్యాయస్థానం విధించిన శిక్షల వివరాలుసెక్షన్ 109 పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10,000 జరిమానా. సెక్షన్ 132 రెండేళ్ల సాధారణ కారాగార శిక్ష, రూ.5,000 జరిమానా. సెక్షన్ 121(1) ఏడాది సాధారణ కారాగార శిక్ష, రూ.5,000 జరిమానా. మొత్తంగా నిందితుడికి పదేళ్ల కారాగార శిక్షతో పాటు రూ.20,000 జరిమానా విధించబడింది. ఈ కేసులో మొదటి దర్యాప్తు అధికారిగా ఖమ్మం సీసీఆర్‌బీ సబ్ ఇన్‌స్పెక్టర్ టి. కవిత, రెండో దర్యాప్తు అధికారిగా సత్తుపల్లి పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్. వీరప్రసాద్ వ్యవహరించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీ డానియల్ న్యాయస్థానంలో ప్రాసిక్యూషన్ తరఫున వాదనలు వినిపించారు. కేసు విచారణ, న్యాయస్థాన ప్రక్రియలో సత్తుపల్లి ఇన్స్పెక్టర్ శ్రీహరి,పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది సహకరించారు. కోర్టు లైజన్ అధికారులుగా ఎస్ఐ కె. శ్రీకాంత్, హెడ్ కానిస్టేబుల్ డి. నాగేశ్వరరావు, సీడీఓగా పి.సి. వి. నరేష్, ప్రాసెస్ విధుల్లో హోంగార్డ్ జె. పర్వీన్ పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు.

# వెంకటేశ్వర కాలనీ స్మశాన వాటిక అభివృద్ధికి రూ.11 లక్షలు

**- మరిన్ని అభివృద్ధి పనులకు ప్రణాళికలు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్**



**జవహర్ నగర్ అక్టోబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్):** చంద్రపురి కాలనీ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర కాలనీ హిందూ స్మశాన వాటికలో రూ.11 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ బింగి లావణ్య సతీష్ గౌడ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ, స్మశాన వాటికను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు మరిన్ని ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గొడుగు వేణు, సీనియర్ నాయకులు మందుల రజిత గోపాల్, కారింగుల రాజు గౌడ్, చిట్టి బాబు, బూడిద వెంకటేష్, జోగి సునీత, మాధవరెడ్డి, అశోక్ గుప్తా, రాహుల్ కదం, సాయి కృష్ణ (మిట్టు), బబ్లూ ముదిరాజ్, భాస్కర్ గౌడ్, కిషోర్, మంజుల, రవి, శ్రీరామ్, ఇరగదిండ్ల రాజు, యాదయ్య, యాదగిరి, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

# రక్తదానం చేయండి.. ప్రాణదాతలుగా నిలవండి

**- పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా నేడు రక్తదాన శిబిరం**

**తొరూరు ప్రతినిధి, అక్టోబర్ 28(పిసిడబ్ల్యూ న్యూస్):** పోలీసు అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకొని తొర్రూరు సబ్‌డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో నేడు రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు తొర్రూరు ఎస్సై మహేందర్ రెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి తొర్రూరు లయన్స్ క్లబ్ కార్యాలయంలో ఈ శిబిరం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. రక్తదానం చేయడం ద్వారా తలసేమియా బాధితులు, నిరుపేద రోగులతో పాటు అత్యవసరంగా రక్తం అవసరమైన వారికి ప్రాణదానం చేసినవారమవుతామని ఎస్సై తెలిపారు. రక్తదానం చేసేందుకు ఆసక్తి ఉన్నవారు ఉదయం 9 గంటలకు లయన్స్ క్లబ్ కార్యాలయానికి చేరుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని పోలీసు అధికారులు విజ్ఞప్తి చేశారు. రక్తదానం చేయండి.. ప్రాణదాతలుగా నిలవండి అని పిలుపునిచ్చారు.

# ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి: మాజీ ఎమ్మెల్యే సండ్ర





సత్తుపల్లి, అక్టోబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్) : ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. బుధవారం సత్తుపల్లిలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఓటరు నమోదు ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.ఓటరు నమోదులో ఏవైనా సమస్యలు ఎదురైతే, బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నమోదు కేంద్రాన్ని సంప్రదించి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఓటరు నమోదు ప్రక్రియను విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సండ్ర వెంకటవీరయ్య కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, మాజీ జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, శీలపురెడ్డి హరికృష్ణ రెడ్డి, కౌన్సిలర్ మొహమ్మద్ భాష, మోరంపూడి ప్రభాకర్, షేక్ రఫీ, వీరప్పనేని బాబి, అమరవరపు కృష్ణారావు, చాంద్ పాషా, పర్వతనేని వేణు, వల్లభనేని పవన్, గుండ్ర రఘు, మారుతి సూరిబాబు, మేకల నరసింహారావు, నడ్డి ఆనందరావు, జొన్నలగడ్డ విజయ్, గుంజి వెంకటేశ్వరరావు, అక్షింతల చంటి తదితరులున్నారు.

# విద్యార్థుల ప్రతిభకు క్రీడా పోటీలు వేదికలు

## విజేతలకు బహుమతులు అందజేసిన టిఆర్ఎస్ గ్రేటర్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు లయన్ డాక్టర్ వెంకటేశ్వర్ రావు










హనుమకొండ,అక్టోబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్) : విద్యార్థుల్లోని అంతర్గత ప్రతిభను గుర్తించి, వారికి తగిన అవకాశాలు కల్పించినప్పుడే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని తెలంగాణ రక్షణ సేన గ్రేటర్ వరంగల్ అధ్యక్షుడు లయన్ డా. నడిపెల్లి వెంకటేశ్వర్ రావు పేర్కొన్నారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయడంతో పాటు వారిని ప్రోత్సహించేందుకు క్రీడా పోటీలు దోహదపడతాయని తెలిపారు. జనగామ జిల్లా విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థుల క్రీడా పోటీల బహుమతుల ప్రదానోత్సవం బుధవారం జనగామ పట్టణంలోని ఏవీ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న నడిపెల్లి వెంకటేశ్వర్ రావు క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో ప్రతిభకు కొదవ లేదని, అయితే ఆ ప్రతిభను ప్రదర్శించేందుకు సరైన వేదికలు, ప్రోత్సాహం అవసరమని పేర్కొన్నారు. క్రీడా పోటీల ద్వారా విద్యార్థులు తమ సామర్థ్యాన్ని నిరూపించుకోవడంతో పాటు ఇతరులతో కలిసి పనిచేయడం, సవాళ్లను ఎదుర్కోవడం, లక్ష్య సాధన కోసం కృషి చేయడం నేర్చుకుంటారని వివరించారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, విజయం సాధించిన వారు మరింత బాధ్యతతో ముందుకు సాగాలని, విజయం సాధించలేకపోయిన వారు నిరుత్సా హపడకుండా తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. పట్టుదల, సాధన, క్రమశిక్షణ ఉంటే ఏ రంగంలోనైనా ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని విద్యార్థులకు తెలియజేశారు. చదువుతో పాటు క్రీడల్లోనూ ఆసక్తి పెంచుకోవాలని, శారీరక దృఢత్వానికి ప్రాధాన్యతనిస్తూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని పేర్కొన్నారు. యువత, విద్యార్థుల భవిష్యత్తు అభివృద్ధికి తెలంగాణ రక్షణ సేన తన వంతు సహకారం అందిస్తుందని తెలిపారు. క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందించడం ద్వారా వారిలో ఉత్సాహాన్ని నింపిన జనగామ జిల్లా విద్యార్థి విభాగం నిర్వాహకులను నడిపెల్లి వెంకటేశ్వర్ రావు అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బీసీ సెల్ గొరిగె నర్సింహా, జనగామ జిల్లా ఇన్‌చార్జి ఆంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి గాండ్ల వెంకన్న, వరంగల్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ బండారి సుమన్, జనగామ పట్టణ అధ్యక్షుడు నరగోని రఘురామ్ గౌడ్, యువజన నాయకుడు అసర్ల సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

# కల్వకుంట్ల కవితను కలిసి ఆశీర్వాదం తీసుకున్న డివిజన్ అధ్యక్షులు

- ఉప్పల్ నియోజకవర్గంలో తెలంగాణ రక్షణ సేనను బలోపేతం చేస్తాం
- ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతాం: డివిజన్ అధ్యక్షులు



ఉప్పల్, అక్టోబర్ 28 (పీసీడబ్ల్యూ న్యూస్): తెలంగాణ రక్షణ సేన ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రమణ దేవ్ ఆధ్వర్యంలో వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ తెలంగాణ రక్షణ సేన అధ్యక్షుడు రంగు శేఖర్ గౌడ్, రామంతాపూర్ డివిజన్ అధ్యక్షుడు ఓర్సు బాలకృష్ణ తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు.ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షులు మాట్లాడుతూ, తమపై నమ్మకంతో డివిజన్ అధ్యక్షులుగా బాధ్యతలు అప్పగించినందుకు కల్వకుంట్ల కవితకు కృతజ్ఞతలు తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గంలో తెలంగాణ రక్షణ సేనను బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాడుతూ, పార్టీ చేపట్టే ప్రతి కార్యక్రమంలో చురుకుగా పాల్గొని విజయవంతం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. రానున్న కార్పొరేటర్ ఎన్నికల్లో ఉప్పల్ నియోజకవర్గంలో అత్యధిక స్థానాల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు నవీన్ గోవికరణ, ఉప్పల్ నియోజకవర్గ బంజారా అధ్యక్షుడు భూక్య కృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# పాత్రికేయులు లేని సమాజం చీకటిమయం

## జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తా: ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం

## ఘనంగా ఐఎఫ్‌డబ్ల్యూజే 76వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు







హైదరాబాద్,అక్టోబర్ 28 (పీసీడబ్ల్యూ న్యూస్): మనిషికి ప్రాణవాయువు ఎంత అవసరమో సమాజానికి జర్నలిజం, జర్నలిస్టులు కూడా అంతే కీలకమని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ ఛైర్మన్ ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐఎఫ్‌డబ్ల్యూజే) 76వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పురుషోత్తం మాట్లాడుతూ, సమాజానికి దిశానిర్దేశం చేసే జర్నలిస్టుల సంక్షేమాన్ని విస్మరించడం విచారకరమన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఆరోగ్య కార్డులు, సంక్షేమ పథకాలు అందాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి జర్నలిస్టుల సమస్యలను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జర్నలిస్టులతో తనకు విడదీయలేని అనుబంధం ఉందని తెలిపారు.కార్యక్రమానికి అధ్యక్షత వహించిన టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ, జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం, పదవీ విరమణ చేసిన పాత్రికేయులకు జాతీయ పెన్షన్ పథకం, జాతీయ మీడియా కమిషన్ ఏర్పాటు కోసం ఐఎఫ్‌డబ్ల్యూజే పోరాటం సాగిస్తోందన్నారు. తెలంగాణలో అన్ని జిల్లాల్లో సంఘాన్ని బలోపేతం చేసి జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కార్యాచరణ చేపడతామని చెప్పారు.ఈ సందర్భంగా సీనియర్ పాత్రికేయులు టి. ఉదయవర్లు, నందిరాజు రాధాకృష్ణ, అద్దంకి శ్రీరామ కుమార్, సి.బి. లక్ష్మి, యర్రమిల్లి రామారావులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, జాతీయ మండలి సభ్యుడు కుంచం శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవికుమార్, కో-కన్వీనర్లు శ్రీనివాస్ గౌడ్, ఎం. రవికుమార్, రాష్ట్ర నాయకులు పి. ఆనందం, కె. పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

# మైనారిటీ మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ

- మహిళలు ఆర్థికంగా ఎదిగి స్వశక్తితో నిలబడాలి: ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



తొరూరు ప్రతినిధి, అక్టోబర్ 28(పిసిడబ్ల్యూ న్యూస్): పాలకుర్తి నియోజకవర్గంలోని మైనారిటీ మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెంది, తమ కుటుంబాలకు అండగా నిలవాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. బుధవారం పాలకుర్తిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు కుట్టు మిషన్లు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించి, కుటుంబ అభివృద్ధితో పాటు సమాజ ప్రగతిలోనూ కీలక పాత్ర పోషించాలని అన్నారు. కుట్టు మిషన్ల ద్వారా ఇంటి వద్దనే ఉపాధి పొందుతూ ఆదాయం సంపాదించవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.మహిళలు ఇతరులపై ఆధారపడకుండా స్వయంగా ఆదాయం సంపాదించే స్థాయికి ఎదగాలని, తమ కుటుంబాల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకోవాలని ఆకాంక్షించారు. మహిళల నైపుణ్యాలను ప్రోత్సహించి, ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా వారి ఆత్మవిశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు.కుట్టు మిషన్లు అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, సంబంధిత ప్రతినిధులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



# తొర్రూరు ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు బస్సులకు పొంచి ఉన్న ప్రమాదం ?

- తల పైన లగేజీలు పడి గాయాలపాలు అవుతున్న ప్రయాణికులు ?.
- బస్టాండ్ ఆవరణలో ఈ భారీ గుంటలను పూడ్చాలని కోరుతున్న ప్రయాణికులు









తొరూరు ప్రతినిధి, అక్టోబర్ 28(పిసిడబ్ల్యూ న్యూస్): ప్రగతి చక్రం అంటూ ప్రచారం చేస్తారు. ప్రైవేటు వాహనాలు వద్దు ఆర్టీసీ బస్సులే ముద్దు అని అంటారు ఆర్టీసీ అధికారులు. ఇక్కడ పరిస్థితి గమనిస్తే సుదూర ప్రాంతం నుండి సుఖ ప్రయాణం చేసి తొర్రూరు ఆర్టీసీ బస్టాండ్ కు వస్తే బస్సులు లోనికి వచ్చే ప్రాంతంలో భారీ గుంతలు పడి బస్సు లో పైన ఏర్పాటు చేసుకున్న లగేజీలు తలపై పడి గాయాల పాలు కావాల్సిందేనా అని ఆర్టీసీ అధికారులపై ప్రయాణికులు మండిపడుతున్నారు ?. వరంగల్ రీజినల్ లో మంచి పేరును సంపాదించుకున్న టీ జి ఎస్ ఆర్ టి సి బస్టాండ్ కు ఎంతో మంచి పేరు ఉన్నది. ఇక్కడ మాత్రం అన్నీ ఉన్న అల్లుడు నోట్లో శని అనే సామెతల మారింది ఆర్టీసీ బస్టాండ్. బస్సులకు ,బస్సులో ప్రయాణించే ప్రయాణికులకు భద్రత కల్పించాలని ప్రయాణికులు గత కొన్ని నెలల నుండి ఆర్టీసీ అధికారులను వేడుకుంటున్నప్పటికీ కూడా బస్టాండ్ లోని భారీ గుంతలను మాత్రం ఎవరూ పూడ్చడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే కాకుండా వర్షాలు పడితే గుంతలలో పూర్తిగా నీరు నిలిచి ఎటు వెళ్లలేని పరిస్థితి ఉండగా గత కొన్ని నెలల క్రితం రోడ్డుకు పక్కనే సిమెంట్ పైపులైను ఏర్పాటు చేశారు అది కాస్త పూర్తిగా డామేజ్ కావడంతో అటుగా ఏమి వాహనాలు వెళ్లకుండా అడ్డుగా దిమ్మలను ఏర్పాటు చేశారు. మరో ప్రాంతంలో నుండి బస్టాండ్ లోనికి బస్సులు రావాలంటే బ్యాటరీ బస్సుల డ్రైవర్లు ఎప్పుడు ఏమి జరుగుతుందో అని భయాందోళన గురవుతున్నట్లు వారు పేర్కొంటున్నారు దీనికి గల కారణాలు బస్సులు పూర్తిగా కిందికి ఉండటంతో ఏ గుంతలో పడి ఏ బస్సు డ్యామేజ్ అవుతుందో అని ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతలను పూడ్చాలని బ్యాటరీ బస్సు డ్రైవర్లు కోరుతున్నారు. ఇలాంటి పరిస్థితి గత సంవత్సర కాలం నుండి కొనసాగుతుందని ఎవరు పట్టించుకోక పోవడంతో పూర్తిగా బస్సులోనికి వచ్చే ప్రాంతంలో రోడ్డు సరిగా లేక ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొంటున్నారు. కొందరు ప్రయాణికులు మున్సిపల్ అధికారులకు దృష్టికి తీసుకువెళ్లి ఎక్కడైనా గృహాలను తొలగించిన పాత ఇటికలు మొరం లాంటిది ఉంటే గుంతలలో పోయించే ఏర్పాటు చేయాలని సలహాలు ఇస్తున్నారు.తొర్రూరు టి జి ఎస్ ఆర్ టి సి బస్టాండ్ లో నెలకొని ఉన్న పరిస్థితులపై తొర్రూరు టీజిఎస్ ఆర్టీసీ బస్ డిపో మేనేజర్ ప్రసూన లక్ష్మి నీ పి సి డబ్ల్యూ న్యూస్ జర్నలిస్ట్ మనోహర స్వామి వివరణ కోరగా సానుకూలంగా స్పందించిన డిపో మేనేజర్ ఇలాంటి పరిస్థితి గతం నుండి ఉన్నదని ఈ విషయంపై అధికారుల దృష్టికి కూడా తీసుకువెళ్లడం జరిగిందని పేర్కొన్నారు. ఇదే కాకుండా బస్టాండ్ ప్రాంతం మొత్తం రహదారులను నిర్మించేందుకు, మరమ్మత్తులు చేసేందుకు టెండర్లను కూడా పిలవడం జరిగిందని వారు వచ్చి మరమ్మతులు చేసేందుకు మరి కొంతకాలం సమయం పట్టవచ్చు అని తెలిపారు. బస్టాండ్లో నెలకొని ఉన్న గుంతలను మునిసిపల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పట్టణంలో ఏ ప్రాంతంలో అయినా నిర్మాణాలను, కూలగొట్టిన ఇటికలు లేదా మొరం లాంటిది ప్రస్తుతానికి పోయించే ఏర్పాటు చేస్తామని వివరణ ఇచ్చారు. ప్రయాణికుల సౌకర్యం కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటారు మనం కూడా వేచి చూడాల్సిందే.

# రాష్ట్రస్థాయి మహిళల కబడ్డీ పోటీలు ప్రారంభం

**• మంత్రి పొంగులేటి జన్మదినం సందర్భంగా నిర్వహణ**






**సత్తుపల్లి, అక్టోబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సత్తుపల్లిలో 73వ రాష్ట్రస్థాయి సీనియర్ మహిళల కబడ్డీ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రాణీ సెలబ్రేషన్ ఫంక్షన్ హాల్‌లో టీజీ ఐడిసి మాజీ చైర్మన్ మువ్వ విజయబాబు ఆధ్వర్యంలో బుధవారం జరిగిన ప్రారంభోత్సవంలో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ పాల్గొని కేక్ కట్ చేసి పోటీలను ప్రారంభించారు. మూడు రోజులపాటు, అక్టోబర్ 28 నుంచి 30 వరకు ఈ పోటీలు జరగనున్నాయి. మహిళా క్రీడాకారిణులను ప్రోత్సహించడం, వారి ప్రతిభను వెలికితీయడం అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ పోటీలతో సత్తుపల్లికి రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు లభించాలని ఆకాంక్షించారు. పోటీల నిర్వహణకు కృషి చేసిన ఐడిసి మాజీ చైర్మన్ మువ్వా విజయబాబును అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ, రాష్ట్రస్థాయి మహిళల కబడ్డీ పోటీలను సత్తుపల్లిలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. పోటీల నిర్వహణకు చేసిన ఏర్పాట్లు, క్రీడాకారిణులకు కల్పించిన వసతి సౌకర్యాలు బాగున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీజీ ఐడిసి మాజీ చైర్మన్ మువ్వ విజయ్ బాబు మాట్లాడుతూ ప్రతిష్ఠాత్మక పోటీల ద్వారా సత్తుపల్లి ఖ్యాతి రాష్ట్రవ్యాప్తంగా మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. మహిళా క్రీడాకారిణులకు ప్రోత్సాహం అందించడం, వారి ప్రతిభను వెలికితీయడం, క్రీడారంగంలో ఉన్నత స్థాయికి ఎదిగేందుకు అవకాశాలు కల్పించడం ఎంతో ముఖ్యమని అన్నారు. ఈ పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారిణులందరూ తమ ప్రతిభను చాటుకుని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కటికాల క్రిస్టఫర్ బాబు, రాష్ట్ర సహాయ కార్యదర్శి కె. స్వాతిముత్యం, చి సుధాకర్, సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ ఎం.డి. రహేన కమల్ పాషా, మున్సిపల్ వైస్ చైర్మన్ బొంతు సుమలత, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గాదె చెన్నారావు, ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, సత్తుపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుబ్బారెడ్డి, పొంగులేటి మువ్వ ప్రధాన అనుచరుడు ఆర్యవైశ్య జిల్లా నాయకులు కాటేపల్లి కిరణ్ కుమార్, వివిధ గ్రామాల సర్పంచులు, మండల స్థాయి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# మర్రిపల్లిలో హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వోడితల ప్రణవ్ బాబు పర్యటన




**కమలాపూర్ అక్టోబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్):** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల పరిధిలోని మర్రిపల్లి గ్రామంలో ఇటీవల మరణించిన తుమ్మల సమ్మయ్య,తుమ్మల రఘుపతి కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించిన హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వోడితల ప్రణవ బాబు వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా వోడి తల ప్రణవ్ బాబు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రతి కార్యకర్తకు అండగా ఉంటుందని ఆపదలో ఉన్న వారి కుటుంబాలను ఆదుకుంటుందని తెలియజేశారు ప్రతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్త అధైర్య పడకుండా పార్టీ కోసం పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమలాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్రిపల్లిగూడెం మర్రిపల్లి గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గొప్ప మనసున్న స్నేహ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి






**కమలాపూర్ అక్టోబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్):** హనుమకొండ జిల్లా పరిధిలోని కానిపర్తి గ్రామానికి చెందిన స్నేహ సేవ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మాదిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మంచి మనస్సు తో వారి తల్లిదండ్రులైన మాదిరెడ్డి ప్రమీల,లక్ష్మారెడ్డి, నానమ్మ,తాతయ్య లు మాదిరెడ్డి నరసమ్మ,లింగారెడ్డి స్మారకార్థం కానిపర్తి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు,గ్రామ క్రీడాకారులు కూర్చోవడం కోసం వారి సొంత నిధులతో దాదాపుగా 6000 వేల రూపాయల ఖర్చుతో సిమెంట్ బెంచీలు వేయించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు,గ్రామ క్రీడాకారులు గ్రామ ప్రజలు వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం,విద్యార్థిని విద్యార్థులు,గ్రామ ప్రజలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసేవలో మంత్రి పొంగులేటి మరిన్ని విజయాలు సాధించాలి

**• కల్లూరులో ఘనంగా మంత్రి పొంగి రెడ్డి జన్మదిన వేడుకలు • ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్**





**కల్లూరు, అక్టోబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాఘుమై దయానంద్ అన్నారు. పట్టణంలోని వీకేఆర్ ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదిన వేడుకలను మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ హాజరై కేక్ కట్ చేసి మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండి ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ఆయన చేస్తున్న కృషి కొనసాగాలని కోరుకున్నారు. మంత్రి మార్గదర్శకత్వంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరింత కష్టపడి పనిచేస్తూ సత్తుపల్లి నియోజకవర్గంతో పాటు కల్లూరు మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రజల ఆశీస్సులు మంత్రి పొంగులేటి కుటుంబంపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. రెవెన్యూ శాఖ మంత్రిగా భూ సమస్యల పరిష్కారం, భూ రికార్డుల నిర్వహణ, ప్రజలకు ప్రభుత్వ సేవలను చేరువ చేయడం వంటి అంశాల్లో మంత్రి మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని నాయకులు ఆకాంక్షించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కల్లూరు మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్, జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు పసుమర్తి చందర్ రావు, మున్సిపల్ వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరి కృష్ణారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోట్రు అర్జున్‌రావు, మండల ఉపాధ్యక్షులు మట్టా రామకృష్ణ, పట్టణ అధ్యక్షుడు షేక్ ఉస్మాన్, జిల్లా యువ నాయకుడు, మంత్రి పొంగులేటి,మువ్వ ప్రధాన అనుచరుడు ఆర్యవైశ్య జిల్లా నాయకులు కాటేపల్లి కిరణ్ కుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్ భాగం నీరజ, మాజీ ఎంపీటీసీ అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి, మత్స్య శాఖ సొసైటీ మాజీ జిల్లా అధ్యక్షులు కాంగ్రెస్ సీనియర్ నాయకులు మర్సకట్ల బాలరాజు, కౌన్సిలర్లు ఉబ్బన రాంబాబు, యాస నాగమణి శ్రీకాంత్, ఖమ్మంపాటి రాధా వీరస్వామి, పెద్దబోయిన లక్ష్మీ నరసింహారావు, గుండ్ల పుల్లారావు, భూక్యా రాంబాయి, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరు కిరణ్ కుమార్, ఏనుగు సత్యంబాబు, కీసర నిర్మల మోహన్ రెడ్డి, నోటి కృష్ణారెడ్డి, బైర్ల కాంతారావు, ఆలకుంట నరసింహా రావు, పాపబత్తిని నగేష్, పంతులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో సీఎం బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమం ప్రారంభం

**• విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటూ ఉన్నత లక్ష్యాలను సాధించాలి: కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్**





**కరీంనగర్ ,అక్టోబర్28(పిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ పట్టణంలోని సుభాష్ నగర్ హనుమాన్ రోడ్డులో ఉన్న హైస్కూల్, ప్రైమరీ స్కూల్‌లలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సీఎం బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాన్ని 26వ డివిజన్ కార్పొరేటర్, కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రజా ప్రభుత్వం విద్యార్థుల విద్యాభివృద్ధి, ఆరోగ్యం, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. హరే రామ హరే కృష్ణ స్వచ్ఛంద సంస్థ, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు అల్పాహారం అందించి, వారు ఆరోగ్యంగా ఉంటూ చదువుపై మరింత శ్రద్ధ చూపేలా ప్రోత్సహించడం లక్ష్యమని పేర్కొన్నారు. విద్యార్థినీ, విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, భవిష్యత్తులో రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేరుస్తూ, మంచి నైపుణ్యాలను పెంపొందించుకుని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. హైస్కూల్ ఉపాధ్యాయులు లక్ష్మీపతి, ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయులు కృష్ణమాచారి, ఇతర ఉపాధ్యాయులు, స్థానిక మాజీ కార్పొరేటర్ వైద్యుల శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# కమలాపూర్‌ను కరువు మండలంగా ప్రకటించిన ప్రభుత్వం

**ఎల్ నినో ప్రభావంతో తీవ్ర లోటు**

**వర్షాభావ పరిస్థితులు..**

**కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు**

**ప్రణాళికలు సిద్ధం చేయాలి: మంత్రి సీతక్క**




**కమలాపూర్ అక్టోబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్):** హనుమకొండ జిల్లాలో ని కమలాపూర్ మండలం ను కరువు మండలం గా ప్రభుత్వం ప్రకటించింది. ఎల్ నినో ప్రభావంతో తీవ్ర లోటు వర్షపాతం ప్రభావం పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలని మంత్రి సీతక్క తెలిపారు. బుధవారం మంత్రి సీతక్క పంచాయతీరాజ్ శాఖ అధికారులు,వివిధ శాఖల అధికారులు ప్రజాప్రతినిధులకు హైదరాబాదు నుండి విసి నిర్వహించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ పంచాయతీరాజ్ శాఖ తోపాటు వివిధ శాఖలు సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని సూచించారు. తీవ్ర లోటు వర్షపాతం ప్రభావం వల్ల నీటి వనరులు అడుగంటు పోయే ప్రమాదం ఉందని దానిని ఎదుర్కొనేందుకు విబిజీ రామ్ జి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కరువు మండలాల్లో తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్లకు మంత్రి సీతక్క ఆదేశించారు. తెలంగాణ జలసిరి పథకం లో ఇంకుడు గుంతలు, కమ్యూనిటీ సోక్ పిట్స్,ఫామ్ ఫండ్స్,డ్రైనేజ్ అండ్ సోక్ పీట్స్ బోర్వెల్ రీఛార్జ్ స్ట్రక్చర్ తో భూగర్భ జలాలు అడుగంటి పోకుండా కొంతవరకు నివారించవచ్చని అన్నారు. కాలువలు చెరువులు పశువుల పాకలు ఇంకా అనేక రకాలైన పనులను కూలీలకు కల్పించి వారిని ఆదుకోవాలని అధికారులను వివిజి రాంజీ సిబ్బందిని ప్రజా ప్రతినిధులను కోరారు. ఈ ప్రభావం భవిష్యత్తులో విద్యుత్ వినియోగంపై భారం పడుతుందని అందువలన పరిస్థితులను ఎదుర్కొనేందుకు అధికారులు ప్రజలు సిద్ధంగా ఉండాలని అన్నారు. తక్కువ కాలం పండించే పంటలను వేసుకోవాలని నీటిని,విద్యుత్తు ను పొదుపు గా వాడుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు పక్క ప్రణాళికతో ముందుకు వెళుతుందని మంత్రి సీతక్క అన్నారు. గూడూర్ రైతు వేదికలో హైదరాబాదు నుండి మంత్రి సీతక్క నిర్వహించిన విసి లో కమలాపూర్ మండలంలోని అధికారులు ప్రజాప్రతినిధులు పంచాయతీ కార్యదర్శులు, విబిజీ రాంజీ సిబ్బంది వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అర్హులైన పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటును నమోదు చేసుకోవాలి

- ఓటరు నమోదు కేంద్రాల సేవలను వినియోగించుకోగలరు
- ప్రముఖ వైద్యులు డాక్టర్ వై రవీంద్రనాథ్




**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్) :** అర్హులైన పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ ఓటును నమోదు చేసుకోవాలని ప్రముఖ వైద్యులు డాక్టర్ వై రవీంధ్రనాథ్ విజ్ఞప్తి చేశారు. స్థానిక త్రీ టౌన్ ప్రాంతంలోని గ్రెయిన్ మార్కెట్ ఎదురుగా ఉన్న ప్రజాసంఘాల కార్యాలయంలో పిడియఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కొల్లి సత్యనారాయణకు సంబంధించిన ఉచిత ఓటరు నమోదు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు వజినేపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలంటే ముందుగా ఓటరుగా నమోదు చేసుకోవడం తప్పనిసరి అని తెలిపారు. వరంగల్‌ఖమ్మంనల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలో ఓటు నమోదుకు నవంబర్ 6తేదీ చివరి రోజని, సమయం తక్కువగా ఉన్నందున అశ్రద్ధ చేయకుండా అర్హులైన ప్రతివారూ తమ ఓటును నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. చివరి తేదీ వరకు వేచి ఉండకుండా వెంటనే దరఖాస్తు చేసుకోవాలని, ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఓటరుగా నమోదు కాకపోతే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసే అవకాశం కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని, అందువల్ల పట్టభద్రులు, విద్యావంతులు ఈ విషయాన్ని తమ మిత్రులు, కుటుంబ సభ్యులు, సహోద్యోగుల దృష్టికి తీసుకెళ్లి అర్హులైన వారందరూ ఓటరుగా నమోదు చేసుకునేలా చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అందుకోసం ప్రజాసంఘాలు ఏర్పాటు చేసిన ఉచిత ఓటరు నమోదు కేంద్రాలను వినియోగించుకోగలరని తెలిపారు. ఓటును నమోదు చేసుకున్న పట్టభద్రులు ప్రగతిశీల ప్రజాస్వామిక కూటమి(పీడీయఫ్) తరుపున పోటీ చేస్తున్న కొల్లి సత్యనారాయణకు మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించగలరని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అభ్యర్థి కొల్లి సత్యనారాయణ, ప్రజాసంఘాలు, పౌర సంఘాల నాయకులు మాదినేని రమేష్, బండారు రమేష్, భుక్యా శ్రీనివాసరావు, బండారు యాకయ్య, యర్రా గోపి, యస్ కె సైదులు, యస్ కె ఇమాం, శీలం వీరబాబు, బండారు వీరబాబు, జార్జి, బండారు రవితేజ, సారంగి పాపారావు, యర్రా మల్లిఖార్జున్, బండారు సునీత, భుక్యా సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

# అర్నబ్ తుఫాన్ ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి

- ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లకు మంత్రి పొంగులేటి ఆదేశాలు
- భారీ వర్షాలు, ఈదురుగాలుల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టండి
- పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని సూచనలు



**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్) :** బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర తుఫాన్ అర్నబ్ ప్రభావంతో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. తుఫాన్ ప్రభావంతో ఈదురుగాలుల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు, నష్టం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్‌తో ఫోన్‌లో మాట్లాడిన మంత్రి.. వాతావరణ పరిస్థితులపై ఆరా తీశారు. రెండు జిల్లాల్లోనూ అప్రమత్తంగా ఉండి, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తుఫాన్ పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించాలని, సంబంధిత శాఖల అధికారులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ముందస్తు ఏర్పాట్లు చేయాలని, పరిస్థితులకు అనుగుణంగా తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు సూచించారు.

# చొప్పదండిని కరువు మండలంగా ప్రకటించాలి

- బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి

**చొప్పదండి, అక్టోబర్ 28(పిసిడబ్ల్యూ న్యూస్):** చొప్పదండిని కరువు మండలంగా ప్రకటించి రైతులు, రైతు కూలీలు, చేతివృత్తుల వారిని ఆదుకోవాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. బీజేపీ గ్రామీణ మండల అధ్యక్షుడు మొగిలి మహేష్ ఆధ్వర్యంలో నాయకులు డిప్యూటీ తహసీల్దార్ సర్దార్ మన్‌మిత్ సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఎండిపోయిన బావులు, కాలువల ద్వారా నీరు అందక రైతులు పంట నష్టపోతున్నారని, రైతు భరోసా నిధులు విడుదల చేయాలని కోరారు. గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని, రైతు కూలీలకు పెండింగ్‌లో ఉన్న నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. రైతుల రుణాలపై వడ్డీ మాఫీ చేసి, దీర్ఘకాలిక రుణాల కిస్తులను వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# శీనన్న జన్మ దినోత్సవాన్ని పురస్కరించుకుని సేవా కార్యక్రమాలు

- ఖమ్మం, కూసుమంచి క్యాంపు కార్యాలయాల్లో రక్తదానం, అన్నదాన కార్యక్రమాలు





**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, శీనన్న అభిమానుల ఆధ్వర్యంలో బుధవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఖమ్మం, కూసుమంచిలోని మంత్రి క్యాంపు కార్యాలయాల్లో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకొన్నారు. రక్తదాన శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలు చేపట్టి అభిమానాన్ని చాటుకున్నారు. **తలసేమియా బాధితుల కోసం రక్తదానం :** ఖమ్మంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మద్దినేని స్వర్ణకుమారి, సీనియర్ న్యాయవాది ముదిరెడ్డి నిరంజన్‌రెడ్డి తదితరులు కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం తలసేమియా బాధితులకు ఉపయోగపడేలా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇందులో 130 మంది రక్తదానం చేశారు. దాదాపు వెయ్యి మందికి అన్నదానం చేశారు. కూసుమంచిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలోనూ...: కాంగ్రెస్ నాయకులు, అభిమానులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 100 మంది రక్తదానం చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. **ప్రజల సంక్షేమమే ధ్యేయం** ఈ సందర్భంగా ఖమ్మం, కూసుమంచి లలో జరిగిన కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిరంతరం ప్రజల మధ్య ఉంటూ, అన్ని వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తున్న ప్రజానాయకుడని కొనియాడారు. పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా కృషి చేస్తుండటంతో రాష్ట్రవ్యాప్తంగా 'ఇందిరమ్మ ఇళ్ల శీనన్న'గా గుర్తింపు పొందారని హర్షం వ్యక్తం చేశారు. జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. క్యాంపు కార్యాలయాల వద్ద అభిమానులు 'జై శీనన్న' నినాదాలతో సందడి చేశారు. ఖమ్మంలో నిర్వహించిన కార్యక్రమంలో... కాంగ్రెస్ నాయకులు మద్ది శ్రీనివాసరెడ్డి, ఉమ్మినేని కృష్ణ, పైడిమర్ల అశోక్‌రెడ్డి, లింగాల రవికుమార్, తాళ్లూరి రాము, ఇనగిండ్ల నాగేశ్వరరావు, ఇమామ్ భాయ్, తదితరులు పాల్గొన్నారు. కూసుమంచిలో... మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బజ్జూరి వెంకటరెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మంకెన వాసు, కార్యదర్శి హాఫీజుద్దీన్, సీడీసీ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

# ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, కరీంనగర్ శాఖ ఆధ్వర్యంలో నషాముక్త్ భారత్ మహా ర్యాలీ







**కరీంనగర్ అక్టోబర్ 28(పిసిడబ్ల్యూ న్యూస్):** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కరీంనగర్ శాఖ చైర్మన్ సంగేం లక్ష్మణరావు, వైస్ చైర్మన్ ఊటుకూరి రాధా కృష్ణ రెడ్డి, మేనేజింగ్ కమిటీ ఆధ్వర్యంలో ఈరోజు కరీంనగర్‌లో నషాముక్త్ భారత్ (మాదకద్రవ్య రహిత భారతదేశం) అవగాహన ర్యాలీ నిర్వహించారు. గీతా భవన్ చౌరస్తా నుంచి స్థానిక కలెక్టరేట్ వరకు నిర్వహించిన ఈ ర్యాలీకి జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ , ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ మరియు టీఎన్జీవోల సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్లు, ఉద్యోగ సంఘాల నాయకులు, రెడ్ క్రాస్ ప్రతినిధులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొని మాదకద్రవ్యాల నిర్మూలనకు తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ, మాదకద్రవ్యాలు మరియు ఇతర మత్తు పదార్థాల బారిన పడకుండా యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత జీవితానికే కాకుండా కుటుంబాలకు, సమాజానికి కూడా తీవ్ర నష్టం కలిగిస్తుందని పేర్కొన్నారు. మాదకద్రవ్య రహిత సమాజ స్థాపన కోసం ప్రతి పౌరుడు బాధ్యతతో ముందుకు వచ్చి, ముఖ్యంగా యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తెలంగాణ రాష్ట్ర గవర్నర్‌తో శివప్రతాప్ శుక్లా నిర్వహించిన జూమ్ సమావేశంలో కూడా పాల్గొన్నారు. ఇదే సందర్భంగా స్థానిక ఆడిటోరియంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ ఊటుకూరి రాధాకృష్ణారెడ్డి 69వ సారి రక్తదానం చేసి రక్తదానంపై తన నిబద్ధతను చాటుకున్నారు. రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడవచ్చని, ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని ఈ సందర్భంగా సభ్యులు సందేశమిచ్చారు. మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణం, యువతలో అవగాహన పెంపొందించడం, రక్తదానం వంటి సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల ప్రాణాలను కాపాడటం లక్ష్యంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కరీంనగర్ శాఖ తన సేవా కార్యక్రమాలను కొనసాగిస్తోందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు పెండ్యాల కేశవరెడ్డి, కుందారపు మహేశ్వర్, కోల అన్నారెడ్డి, శ్రీహరి రెడ్డి, కానపర్తి మనోహర్ రావు, రాగి శ్రీనివాస్, చిదుర సురేష్, హన్మండల రాజిరెడ్డి, రాకేష్, పెద్ది విద్యాసాగర్, గోనే శ్రీనివాస్, ఎలగందుల మునీందర్, నరేందర్, టీఎన్జీవోల రాష్ట్ర సంఘం నాయకులు సర్దార్ హర్మిందర్ సింగ్, గూడ ప్రభాకర్ రెడ్డి, మారుపాక రాజేష్ భరద్వాజ్, కోట రామస్వామి, శంకర్, గంగారపు రమేష్ గౌడ్, ఓంటేల ప్రసాద్ రెడ్డి, మొహమ్మద్ అలీ, శంషుద్దీన్, కయ్యం శ్రీనివాస్, గుండా రాజేష్ పాల్గొన్నారు.

# కరీంనగర్ జిల్లా మొత్తం కరువు జిల్లాగా ప్రకటించాలి

**కరువు జాబితాలో కరీంనగర్ జిల్లాకు తీవ్ర అన్యాయం**

**జిల్లాలోని అన్ని మండలాలను కరువు జాబితాలో చేర్చాలి.**

**జిల్లా కలెక్టర్ కువినతిపత్రం సమర్పించిన బిజెపి నేతలు...**



**కరీంనగర్, అక్టోబర్ 28(పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కరువు ప్రభావిత మండలాల జాబితాలో కరీంనగర్ జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగిందని ,జిల్లాలోని అనేక మండలాల్లో కరువు పరిస్థితులు తాండవిస్తున్నప్పటికీ, వాటిని విస్మరించి కేవలం 3 మండలాలను మాత్రమే జాబితాలో చేర్చకపోవడం పట్ల బిజెపి శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు బుధవారం రోజున కరీంనగర్ జిల్లా లోని అన్ని మండలాలను కరువు జాబితాలో చేర్చాలని , మొత్తం కరీంనగర్ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బిజెపి కరీంనగర్ జిల్లా మాజీ అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, బాస సత్యనారాయణ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జ , శ్రీనివాస్ రావు , కనుమల్ల గణపతి ,డిప్యూటీ మేయర్, రాష్ట్ర అధికార ప్రతినిధి వై సునీల్ రావు, పార్లమెంట్ కన్వీనర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డిలు జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు. సకాలంలో వర్షాలు కురవకపోవడం, కరెంట్ సరిగ్గా అందకపోవడం వల్ల జిల్లాలో పంట దిగుబడి పూర్తిగా దెబ్బతిన్నదని, భూగర్భ జలాలు ఎండిపోయాయని తెలిపారు. సాగు, తాగు నీటికి తీవ్ర కొరత ఏర్పడటంతో రైతులు, సామాన్య ప్రజల ఆర్థిక స్థితిగతులు, జీవన ప్రమాణాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం సాధారణ వర్షపాతం గణాంకాల ఆధారంగా కాకుండా, మండలాల వారీగా నమోదైన వర్షపాతం, నేలలో తేమ, పంటల నష్టం, సాగునీటి లభ్యత, భూగర్భ జలాల స్థాయి, ఉపగ్రహ చిత్రాలు, వ్యవసాయ శాఖ క్షేత్రస్థాయి నివేదికలు రైతుల ఫిర్యాదులను పరిగణలోకి తీసుకొని కరువు ప్రభావిత ప్రాంతాలను శాస్త్రీయంగా అంచనా వేయాలని డిమాండ్ చేశారు. అర్హత ఉన్న ప్రతి మండలాన్ని కరువు ప్రభావిత జాబితాలో చేర్చాలని, కరువు ప్రభావిత రైతులకు వర్తించే ఇన్పుట్ సబ్సిడీ, పంట రుణాల పునర్వ్యవస్థీకరణ, సాగునీరు, తాగునీరు, పశుగ్రాసం వంటి సహాయక చర్యల అమలుపై యుద్ధ ప్రాతిపదికన సమీక్ష నిర్వహించాలని కోరారు. రైతు సంక్షేమం, వ్యవసాయ పరిరక్షణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ స్థిరత్వాన్ని దృష్టిలో ఉంచుకొని కరీంనగర్ జిల్లా రైతులకు సంపూర్ణ న్యాయం జరిగేలా తగిన చర్యలు తీసుకోవాలని వారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ను కోరారు.

# జర్నలిస్టులకు 'శనగపాటి ఫౌండేషన్' ప్రతిభా పురస్కారాలు

**- సీనియర్ జర్నలిస్ట్, శనగపాటి అమ్మా నాన్న ఫౌండేషన్ వ్యవస్థాపకులు శనగపాటి మురళీకృష్ణ**




**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్) :** "శనగపాటి అమ్మానాన్న ఫౌండేషన్" ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని జర్నలిస్టుల ప్రతిభను పోత్సాహమందించేందుకు ఏటేటా నగదు పురస్కారాలు అందించనున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు, సీనియర్ జర్నలిస్టు శనగపాటి మురళీకృష్ణ పేర్కొన్నారు. ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఫౌండేషన్ కార్యక్రమాలను వివరించారు. 'ఎల్‌నినో – పేదల జీవనంపై ప్రభావం' అనే అంశంపై ఈ ఏడాది అక్టోబర్ 30 నుండి నవంబర్ 30 వరకు రాసిన కథనాలను డిశెంబర్ 10వ తేదీలోగా తమ ఫౌండేషన్ చిరునామాకు పంపించాలని సూచించారు. ప్రింట్ మీడియా జర్నలిస్టులు పేపర్ క్లిప్పింగ్‌తో పాటు ఆ రోజు పత్రికను కథనంతో జత చేసి పంపించాలని సూచించారు. అలాగే డిజిటల్ మీడియా విలేకర్లు కథనంతో పాటు వెబ్ సైట్ లింక్‌ను పంపించాలన్నారు. అవార్డుకు పంపేవారు హామీ పత్రం, పాస్‌పోటో, చిరుమాను జత చేసి పంపించాలన్నారు. పోటీకి వచ్చిన కథనాలను సీనియర్ జర్నలిస్టులు నామా పురుషోత్తం, కనకం సైదులు ఆధ్వర్యంలో కమిటీ పరిశీలించి ఎంపిక చేస్తుందని తెలిపారు. అవార్డుల ఎంపికలో కమిటీదే తుది నిర్ణయమని, దీనిపై ఎలాంటి ఉత్తర, ప్రత్యుత్తరాలకు తావు లేదని పేర్కొన్నారు. ఎంపిక చేసిన జర్నలిస్టులకు 2028 జనవరిలో అవార్డులను అందచేస్తామన్నారు. ప్రింట్ మీడియా జర్నలిస్టుకు 5000 నగదు బహుమతి, డిజిటల్ మీడియాకు 3000 నగదు బహుమతితో పాటు మెమెంటో, ప్రశంసాపత్రం అందచేసి సన్మానించనున్నట్లు తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని జర్నలిస్టు మిత్రులు ఈ పురస్కారానికి తమ కథనాలను టి మీడియా కార్యాలయం, ఆర్టీసీ డిపో వెనుక, మామిళ్ళగూడెం అనే చిరునామాకు పంపించాలని కోరారు. పూర్తి వివరాలకు 98666 45218, 8919710365 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

**- నెలకో కవి సమ్మేళనం నిర్వహణ**

ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామాజిక, సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. నెలకో కవి సమ్మేళనం నిర్వహించి వర్ధమాన కవులను ప్రోత్సహిస్తామన్నారు. ప్రతి నెలా ఏదైనా ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలను నిర్వహించి బహుమతులను అందచేస్తామన్నారు. అలాగే సమకాలీన అంశాలపై చర్చా వేదికలు, సెమినార్లు, రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. ఫౌండేషన్ కార్యక్రమాలను అందరూ ప్రోత్సహించి సహకరించాలని కోరారు. ఈ మీడియా సమావేశంలో జర్నలిస్టుల అవార్డు కమిటీ కన్వీనర్, సీనియర్ జర్నలిస్టు నామా పురుషోత్తం, ఫౌండేషన్ సభ్యులు జి.రామారావు పాల్గొన్నారు.

# ప్రముఖ నాయకులతో మహ్మద్ అఫ్జల్ ఆత్మీయ ముఖాముఖి





















**కరీంనగర్, అక్టోబర్ 28(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ఉద్యమకారుడు, బి.అర్.ఎస్.వై మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ముకరంపుర బి ఆర్ ఎస్ అధ్యక్షుడు మహ్మద్ అఫ్జల్ పలువురు ప్రముఖ రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఇతర రంగాల ప్రముఖులను ఆత్మీయంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారితో కలిసి దిగిన ఫొటోలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మాజీ పార్లమెంటు సభ్యుడు బి. వినోద్ కుమార్, తెలంగాణ మాజీ హోంమంత్రి మహమూద్ అలీ, ఎంపీ ఈటల రాజేందర్, తెలంగాణ మంత్రి, భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మహమ్మద్ అజారుద్దీన్, మాజీ ఎంపీ జె. సంతోష్ కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌లతో పాటు జూమ్స్ విభాగాధిపతి డాక్టర్ అమిత్ కుమార్, మైత్రి గ్రూప్ చైర్మన్ జయపాల్ రెడ్డి, రాము, ఎఐఎంఐఎం జిల్లా అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్, పట్టణ అధ్యక్షుడు అతీఫ్ అతినా తదితరులను మహ్మద్ అఫ్జల్ కలిశారు. ఈ ఆత్మీయ సమావేశాల సందర్భంగా ఆరీఫ్, కరీం, ముసావీర్, యాదిరెడ్డి, వజు భాయ్, అంజద్, శ్రీనివాస్ రెడ్డి, అంజి రెడ్డి, ఇమ్రాన్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు. ప్రముఖులతో ఆత్మీయంగా గడిపిన ఈ క్షణాలు తనకు మధుర జ్ఞాపకాలుగా నిలిచాయని మహ్మద్ అఫ్జల్ పేర్కొన్నారు.

# బీసీల రాజ్యాధికార పోరాటంలో మున్నూరుకాపులు ముందుండాలి

**- మున్నురుకాపు రాష్ట్ర అధ్యక్షులు పుట్టం పురుషోత్తమరావు**




**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 28 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సామాజికంగా, ఆర్థికంగా, విద్యపరంగా బీసీలను పాలక వర్గాలు అణచి వేస్తున్నాయని, బీసీల రాజ్యాధికార పోరాటంలో మున్నూరుకాపులు ముందుండాలని మున్నురుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుట్టం పురుషోత్తమరావు అన్నారు. ఖమ్మంలోని మున్నురుకాపు హాస్టల్ ప్రాంగణంలో బుధవారం జరిగిన జిల్లా కార్యవర్గ, అనుబంధ సంఘాల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగిస్తూ... రాష్ట్రంలో బీసీల ఎడల ప్రభుత్వం అణచివేసే ధోరణిని అవలంభిస్తోందని విమర్శించారు. ఎన్నికలు వచ్చినప్పుడు బీసీల జపం చేస్తారని, అధికారాన్ని పంచుకునే క్రమంలో తమకు ప్రాతినిధ్యం ఎక్కడ కనిపించడం లేదని అసహనం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 60 శాతం ఉన్న బిసిలలో 22 శాతం మున్నురుకాపులు ఉన్నారని, తక్కువ శాతంగా ఉన్నారని చూపించే కుట్ర జరగడంపై ధ్వజమెత్తారు. బీసీలను ఓటు బ్యాంకుగా చూసే రాజకీయాలకు ఇకనైనా పాలక వర్గాలు ముగింపు పలకాలని హితవుపలికారు. రాష్ట్ర మంత్రి వర్గంలో ఒక్కరికైనా మున్నురుకాపులకు అవకాశం కల్పించక పోవడం తమను అవమానించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓట్లు మావి, కష్టాలు మావి... ప్రజాస్వామ్యంలో మా పాత్ర చైతన్యవంతమైనది. నిర్ణయాధికారంలో మాత్రం జనాభా ప్రతిపాధికన వాటా ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. మున్నురుకాపులు ఐక్యతతో ఉండి, బీసీల హక్కుల సాధన కోసం ముందుండి పోరాడాలని పిలుపునిచ్చారు. రాజ్యాధికారం అంటే పదవులు మాత్రమే కాదని, ప్రభుత్వ విధానాల్లో మన గొంతుకను వినిపించడం, బీసీలకు న్యాయం జరిగేలా వ్యవస్థలో ప్రాతినిధ్యం సాధించడమేనని పేర్కొన్నారు.

**కార్యవర్గ నిర్ణయాలు...** రానున్న ఎన్నికల్లో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పదవిని బీసీలకు కేటాయించాలి. అందుకు గాను మెజార్టీ డివిజన్లను బిసిలకు కేటాయించాలి. జిల్లా, మండల, గ్రామీణ స్థాయిలో సంఘాన్ని మరింత బలోపేతం చేయాలి. యువత, మహిళలు, విద్యార్థులను సంఘా కార్యకలాపాల్లో పాల్గొనేలా చూడాలి. బీసీ సంఘాల్లో సమన్వయం పెంచి, హక్కుల సాధనకోసం ఉద్యమించాలి. ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేసేలా కృషి చేయాలి. భవిష్యత్తులో బీసీ సంఘాలన్నింటితో అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటుచేసి... బీసీల సమస్యలపై పోరాడాలని తీర్మానించారు. నవంబర్ 15న ఖమ్మంలోని చెరుకూరి మామిడి తోటలో జరగబోయే మున్నురుకాపు జిల్లా వన మహా సమారాధనను విజయవంతం చేయాలని తీర్మానంలో పేర్కొన్నారు. జిల్లా గౌరవ అధ్యక్షులు కొత్తా సీతారాములు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ, రాష్ట్ర కార్యదర్శి ఆవుల రామారావు, కోశాధికారి కంచి సత్యనారాయణ, జిల్లా అధ్యక్షులు శీలంశెట్టి వీరభద్రం, ప్రధాన కార్యదర్శి పసుపులేటి దేవేందర్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు పగడాల మంజుల, గౌరవ సలహాదారు పార నాగేశ్వరరావు, పొదిలా రవికుమార్, పసుపులేటి నాసరయ్య, జిల్లా కోశాధికారి మదూరి పూర్ణచందర్ రావు, జిల్లా యూత్ అధ్యక్షులు తోట రమేష్, పట్టణ అధ్యక్షులు పారా ఉదయ్ కుమార్, పట్టణ కార్యదర్శి తోట వీరభద్రం, గౌరవ అధ్యక్షులు సాయికృష్ణ, మున్నారుకాపు సంఘం నాయకులు రమాదేవి, వెంకటేశ్వరరావు, ఆళ్ల కృష్ణ, మేకల నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్య రహిత భారత్ కోసం అవగాహన ర్యాలీ

**• 69వసారి రక్తదానం చేసిన రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి**








**కరీంనగర్, అక్టోబర్ 28(పిసిడబ్ల్యూ న్యూస్):** ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కరీంనగర్ శాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్య రహిత భారత్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. గీతాభవన్ చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు సాగిన ఈ ర్యాలీలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ, టీఎన్జీవోల జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటి వినియోగం వ్యక్తులు, కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం స్థానిక ఆడిటోరియంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ ఊటుకూరి రాధాకృష్ణారెడ్డి 69వసారి రక్తదానం చేశారు. ఆరోగ్యవంతులు స్వచ్ఛందంగా రక్తదానం చేసి ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు, ఉద్యోగ సంఘాల నాయకులు, కళాశాలల విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్లు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# అండర్19 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన పుటుకం సాయి చరణ్



**గంగాధర, అక్టోబర్28(పీసీడబ్ల్యూ న్యూస్):** మండలంలోని గంగాధర గ్రామానికి చెందిన పుటుకం సాయి చరణ్ అండర్19 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన అండర్19 క్రికెట్ సెలెక్షన్ పోటీల్లో సాయి చరణ్ అద్భుతమైన ప్రతిభ కనబరిచాడు. దీంతో కరీంనగర్ జిల్లా జట్టుకు ఎంపికయ్యాడు. ఈ నెల 31వ తేదీ నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు మహబూబ్‌నగర్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో కరీంనగర్ జిల్లా జట్టు తరపున ప్రాతినిధ్యం వహించనున్నాడు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన సందర్భంగా క్రికెట్ కోచ్ గంటా విజయ్, పుటుకం రవీంద్రనాథ్ ఠాగూర్, వివేక్, లవకుమార్, ఉప్పి, ప్రణయ్, శ్రీకాంత్‌తో పాటు పలువురు క్రీడాకారులు, నాయకులు సాయి చరణ్‌ను అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# మహిళా సంఘం భవన నిర్మాణానికి భూమి పూజ



**రామడుగు, అక్టోబర్ 28 (పిసీడబ్ల్యూ న్యూస్):** రామడుగు మండలం కిష్టాపూర్ గ్రామంలో మహిళా సంఘం భవన నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వేల్పుల మల్లేశం, ఆధ్వర్యంలో మహిళా సంఘం భవన నిర్మాణ పనులకు భూమి పూజ చేసి శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ భవనం నిర్మాణం ద్వారా గ్రామంలోని మహిళా సంఘాల సభ్యులకు సమావేశాలు నిర్వహించుకోవడానికి, మహిళల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి, స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలను మరింత బలోపేతం చేసుకోవడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. మహిళలు ఆర్థికంగా ఎదగడంతో పాటు, గ్రామ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని, మహిళా సంఘాల ద్వారా మహిళలకు మరిన్ని అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ భవన నిర్మాణం చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం జ్యోతి సీసీ వనిత రాణి మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొమ్మరవేణి తిరుపతి ఉప సర్పంచ్ కటుకం మనీష్ వార్డు సభ్యులు లచ్చయ్య, రమ మాజీ ఎంపిటిసి కటుకం రాజిరెడ్డి, మాజి సర్పంచు కటుకం శ్రీనివాస్ రెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ జవ్వాజి అజయ్ వివో వాణి గ్రామ శాఖ అధ్యక్షులు సాయిని సాయి మరియు ఆంజనేయులు, మధుసుదన్, వర్దన్, మల్లయ్య, శ్రీనివాస్ మరియు మహిళా సంఘాల సభ్యులు, గ్రామ పెద్దలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఏఐ ప్రమాదకరం

## : డీప్ ఫేక్ వీడియోలపై కృతి సనన్ పోరాటం



ప్రముఖ బాలీవుడ్ నటి కృతి సనన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) దుర్వినియోగంపై న్యాయపోరాటానికి దిగారు. తన వ్యక్తిత్వ, ప్రచార హక్కులను (పర్సనాలిటీ అండ్ పబ్లిసిటీ రైట్స్) కాపాడాలంటూ ఆమె ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఏఐ టెక్నాలజీని ఉపయోగించి తన అనుమతి లేకుండా డీప్‌ఫేక్ వీడియోలు, ఫేక్ ఎండార్స్‌మెంట్లు సృష్టించకుండా అడ్డుకోవాలని ఆమె కోరారు.

ఈ పిటిషన్‌పై జస్టిస్ పురుషైంద్ర కుమార్ కౌరవ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. వ్యక్తిత్వ హక్కులకు సంబంధించిన అంశాలపై మరిన్ని వివరాలు, గత తీర్పులను సమర్పించాలని కృతి తరఫు న్యాయవాదులను ఆదేశిస్తూ, తదుపరి విచారణను రేపటికి వాయిదా వేసింది.

ఇటీవల ఒక కార్యక్రమంలో మాట్లాడిన కృతి సనన్, ఏఐ టెక్నాలజీ తనను తీవ్రంగా భయపెడుతోందని వ్యాఖ్యానించారు. "ఏఐ ఒక పదునైన కత్తి లాంటిది, అది ఎంత పదునుగా ఉంటే అంత ప్రమాదకరం" అని ఆమె అన్నారు. సోషల్ మీడియాలో ఏఐ ద్వారా సృష్టించిన తన ఫొటోలను రిపోర్ట్ చేయడానికి సరైన నిబంధనలు కూడా లేవని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే ఆమె కోర్టును ఆశ్రయించడం ప్రాధాన్యత సంతరించుకుంది.



# నవీన్ చంద్ర హీరోగా నటిస్తున్న 51వ సినిమా షూటింగ్ పూర్తి



విలక్షణ నటుడు నవీన్ చంద్ర హీరోగా నటిస్తున్న కొత్త సినిమా షూటింగ్ పూర్తయింది. ఆయన కెరీర్‌లో ఇది 51వ చిత్రం కావడంతో, తాత్కాలికంగా 'ఎన్‌సీ 51' అనే టైటిల్‌తో ఈ ప్రాజెక్ట్‌ను పిలుస్తున్నారు. ఆర్.పి. బాల దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ చెన్నైలో ముగిసింది. ఈ విషయాన్ని నవీన్ చంద్ర స్వయంగా సోషల్ మీడియా ద్వారా వెల్లడించాడు.

ఈ చిత్రంలో నవీన్ చంద్ర సరసన హరిప్రియ రోషిణి హీరోయిన్‌గా నటిస్తుండగా, బాల శరవణన్, కాళీ వెంకట్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఓ వినూత్నమైన కథాంశంతో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచేలా ఈ సినిమాను రూపొందిస్తున్నట్లు చిత్ర యూనిట్ తెలిపింది.దర్శకుడు ఆర్.పి. బాల ఈ చిత్రానికి నిర్మాతగా కూడా వ్యవహరిస్తుండగా, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ పి.జి. ముత్తయ్య మరో నిర్మాతగా ఉంటూ సినిమాకు ఛాయాగ్రహణం అందిస్తున్నారు. శక్తి బాలాజీ సంగీతం, అజయ్ మనోజ్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.ప్రస్తుతం సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి సినిమాను థియేటర్లలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. అధికారిక టైటిల్, ఫస్ట్ లుక్ వివరాలను త్వరలో ప్రకటించనున్నారు.

# 'దొంగ నా కొడుకు' నుంచి 'ఓ మై గాడ్' సాంగ్ రిలీజ్!

పాన్ ఇండియా నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై వస్తున్న వినూత్న చిత్రం 'దొంగ నా కొడుకు'. మౌళి తనూజ్ ప్రశాంత్ హీరోగా నటిస్తున్న ఈ క్రైమ్ కామెడీ సినిమాకు శ్రీను కంబాల దర్శకుడిగా పరిచయమవుతున్నారు. నవంబర్ 13న ఈ చిత్రం థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో సినిమాపై అంచనాలను పెంచేలా మేకర్స్ మ్యూజికల్ ప్రమోషన్స్‌ను ప్రారంభిస్తూ తాజాగా 'ఓ మై గాడ్' ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేశారు. ఆ విశేషాలు ఇప్పుడు చూద్దాం! రామ్ మిరియాల ఎనర్జిటిక్ వాయిస్‌తో మ్యాజిక్: సింజిత్ ఎర్రమిల్లి స్వరపరిచిన 'ఓ మై గాడ్' పాట రొమాంటిక్‌గా, జోష్ నింపేలా ఉంది. ఆకట్టుకునే మ్యూజిక్, కొత్త తరహా బీట్స్ ఈ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇక సింగర్ రామ్ మిరియాల తనదైన ఎనర్జీ, ప్రత్యేకమైన వాయిస్‌తో ఈ పాటకు మరింత జోష్ తీసుకొచ్చారు. ఆయన డైనమిక్ వోకల్స్ పాటను మరో లెవెల్‌కి తీసుకెళ్లాయని చెప్పవచ్చు. భాస్కరభట్ల చక్కటి సాహిత్యం: ప్రేమలో పడిన హీరో తన మనసులోని ఫిలింగ్స్ భాస్కరభట్ల సాహిత్యం ద్వారా అందంగా పలికించారు. తన జీవితంలోకి ప్రేయసి వచ్చిన తర్వాత ఎలాంటి మార్పులు చోటుచేసుకున్నాయి, ఆమెతో గడిపే ప్రతి క్షణం ఎందుకు ప్రత్యేకంగా అనిపిస్తుందో ఈ పాటలో చూపించారు. ప్రేమలో కలిగే కొత్త ఉత్సాహం, అనుభూతులను ఈ పాట ఆకట్టుకునేలా రాసారు.అదిరిపోయే కొరియోగ్రఫీ: ఈ పాటకు ఆట సందీప్ అందించిన కొరియోగ్రఫీ చాలా అందంగా ఉంది. హీరో మౌళి తనూజ్ ప్రశాంత్ తన ఎనర్జిటిక్ డ్యాన్స్‌తో ఆకట్టుకోగా, హీరోయిన్ సుష్మిత శెట్టితో ఆయన ఆన్‌స్క్రీన్ కెమిస్ట్రీ ఎంతో క్యూట్‌గా ఉంది. ఇక యూత్‌ఫుల్ రొమాంటిక్ వైబ్‌తో సాగిన ఈ పాట మ్యూజిక్ లవర్స్‌ను ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం సోషల్ మీడియాలోనూ ఈ సాంగ్ ట్రెండ్ అవుతోంది. భారీ తారాగణం.. త్వరలోనే రిలీజ్: ఇప్పటికే ఫస్ట్ లుక్ పోస్టర్, టీజర్‌తో మంచి బజ్ క్రియేట్ చేసిన మూవీ ఇప్పుడు ఈ మెలోడీ సాంగ్‌తో సినిమా ప్రమోషన్లను జోరుగా కొనసాగిస్తోంది. ఈ చిత్రంలో అలీ, రజిత, రఘుబాబు, ప్రియా, గుండు సుదర్శన్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇక నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు.




# లాస్ ఏంజిల్స్‌లో 'రామాయణ' స్పెషల్ స్క్రీనింగ్..




భారత సినీ పరిశ్రమలోనే అత్యంత భారీ బడ్జెట్‌తో, ఎన్నో అంచనాల నడుమ తెరకెక్కుతున్న చిత్రం 'రామాయణ'. నితేశ్ తివారీ దర్శకత్వంలో, రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవి, యశ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమా కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

నవంబర్ 5న దీపావళి కానుకగా మొదటి భాగం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న నేపథ్యంలో చిత్ర బృందం అక్టోబర్ 27న లాస్ ఏంజిల్స్‌లో ఒక ప్రత్యేక ప్రీమియర్ షోను ఏర్పాటు చేసింది. ఈ ప్రదర్శన అనంతరం సినిమాపై తొలి రివ్యూలు సోషల్ మీడియాలో వచ్చేశాయి.

సినిమా చూసిన వారిలో చాలామంది దీన్ని ఒక అద్భుతమైన దృశ్యకావ్యంగా అభివర్ణించారు. విజువల్స్, సంగీతం, యాక్షన్ సన్నివేశాలు కనీవినీ ఎరుగని రీతిలో ఉన్నాయని కొనియాడారు. ఒక నెటిజన్ రాస్తూ.. ""రామాయణ: రైజ్ ఆఫ్ ఏ లెజెండ్' అద్భుతంగా ఉంది. విజువల్స్, నృత్యాలు, సంగీతం, యాక్షన్ అన్నీ భారీ స్థాయిలో ఉన్నాయి. రణ్‌బీర్ కపూర్ నటన అమోఘం, యశ్ చాలా ఆకర్షణీయంగా కనిపించారు. ఈ ఏడాది అత్యంత గొప్ప సినిమాటిక్ అనుభవాలలో ఇదొకటి" అని పోస్ట్ చేశారు.మరొకరు "వచ్చే వారం బాక్సాఫీస్ వద్ద విధ్వంసం ఖాయం. బ్లాక్‌బస్టర్ గ్యారెంటీ! నటీనటులందరూ అద్భుతంగా నటించారు" అంటూ ప్రశంసించారు. ముఖ్యంగా శ్రీరాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్ నటనకు ప్రేక్షకులు భావోద్వేగానికి గురయ్యారని పలువురు పేర్కొన్నారు. "రామాయణ చిత్రం ప్రేక్షకులను కంటతడి పెట్టించింది. రణ్‌బీర్ ఒక అసాధారణ నటుడు. మేం గెలిచేశాం!" అంటూ ఒక అభిమాని తన ఆనందాన్ని పంచుకున్నారు. ఈ ప్రత్యేక ప్రదర్శనకు నిర్మాత నమిత్ మల్హోత్రా, దర్శకుడు నితేశ్ తివారీ దంపతులు, రణ్‌బీర్ కపూర్, యశ్, సాయిపల్లవి వంటి తారలందరూ సంప్రదాయ దుస్తుల్లో హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

కాగా, సినిమాలో ఆత్మ లోపించిందని, దైవిక భావన లేదని, సంగీతం ఆశించిన స్థాయిలో లేదని కొందరు అభిప్రాయపడ్డారు.ఈ సినిమాను రెండు భాగాలుగా, సుమారు రూ.4000 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నట్లు నిర్మాత నమిత్ మల్హోత్రా గతంలో వెల్లడించారు. "ఏడెనిమిదేళ్ల క్రితం ఈ ప్రాజెక్ట్ మొదలుపెట్టినప్పుడు అందరూ నన్ను పిచ్చివాడిలా చూశారు. ప్రపంచంలోనే గొప్ప ఇతిహాసాన్ని ప్రపంచ ప్రేక్షకుల ముందుకు తీసుకెళుతున్నాం. హాలీవుడ్ సినిమాలతో పోలిస్తే మేం చాలా అద్భుతంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం" అని ఆయన తెలిపారు.

మొత్తం మీద 'రామాయణ' చిత్రం అద్భుతమైన విజువల్స్, నటీనటుల ప్రతిభతో ప్రశంసలు అందుకుంటోంది. ఈ స్పందనల నడుమ నవంబర్ 5న విడుదల కానున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి అద్భుతాలు సృష్టిస్తుందో వేచి చూడాలి.



## సందీప్ కిషన్ 'పవర్ పేట'..

# 'పడమటి వీధి జానకి'గా రితికా నాయక్..

యంగ్ హీరో సందీప్ కిషన్ నటిస్తున్న ఆసక్తికర చిత్రం 'పవర్ పేట'. ఈ సినిమా నుంచి హీరోయిన్ రితికా నాయక్ పుట్టినరోజు (అక్టోబర్ 27) సందర్భంగా ఆమె పాత్రను పరిచయం చేస్తూ చిత్రబృందం ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఇందులో ఆమెను 'పడమటి వీధి జానకి' అనే విభిన్నమైన పేరుతో పరిచయం చేశారు.విడుదలైన పోస్టర్‌లో రితికా నాయక్ ఎంతో సాంప్రదాయబద్ధంగా, హోమ్లీ లుక్‌లో ఆకట్టుకుంటున్నారు. క్రీమ్ కలర్ హాఫ్ శారీ, పింక్ దుపట్టా, స్లీవ్‌లెస్ బ్లౌజ్‌తో పాటు సాంప్రదాయ ఆభరణాలు ధరించి, పాతకాలం నాటి ఇంట్లో హుందాగా కూర్చుని కనిపించారు. ఈ లుక్ ఆమె పాత్రపై ఆసక్తిని రేకెత్తిస్తోంది. అయితే, పోస్టర్‌లో డీగ్లామర్‌గా కనిపిస్తున్నప్పటికీ, సినిమాలో ఆమె కొన్ని గ్లామరస్ సన్నివేశాల్లో కూడా నటిస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా వర్షంలో కొన్ని సీన్లు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. రాజకీయం, ప్రేమ, అధికార పోరాటం వంటి అంశాల నేపథ్యంలో ఈ సినిమాను టాలెంటెడ్ డైరెక్టర్ కృష్ణ చైతన్య తెరకెక్కిస్తున్నారు. సందీప్ కిషన్ ఇందులో 'సేనాపతి రవి' అనే పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తున్నారు. మణిశర్మ సంగీతం అందిస్తుండగా, 70ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మిస్తున్నారు. ఇప్పటికే సినిమా షూటింగ్ 60 శాతం పూర్తయింది.'మిరాయ్', 'కొరియన్ కనకరాజు' వంటి విజయాలతో మంచి ఫామ్‌లో ఉన్న రితికా నాయక్ ఈ చిత్రంలో కథానాయికగా ఎంపిక కావడం విశేషం. గతంలో ఈ ప్రాజెక్ట్ పలువురు హీరోల వద్దకు వెళ్లినప్పటికీ, చివరికి సందీప్ కిషన్‌తో ఖరారైంది. తాజాగా విడుదలైన 'పడమటి వీధి జానకి' గ్లింప్స్ సినిమాపై అంచనాలను పెంచింది. సందీప్, రితికా మధ్య కెమిస్ట్రీ ఎలా ఉండబోతుందోనని ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు.